VASANTH KUMAR
Director
Victoria Consultants
Overseas Educational Services
(Australia, Canada, U.K. U.S.A., New Zealand)
QUALITY SERVICE SINCE 1997
AAERI MEMBER
QEAC No. E334
: 1-10-3, Ashok Nagar, Hyderabad-20. INDIA
: 91(40) 27628134, 27674037
: victoria.ashoknagar@gmail.com
: //www.victoriaoverseas.com

PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక

సంపుటి: 5 సంచిక: 340, పేజీలు - 08

ఆదివారం, మే 31, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

Host On Your Domain
Hosting / Admin Panel
Page Builder / Social Links
Responsive Design
Advertisement Spaces
Search Engine Optimization
XML Sitemap
Automatic Software Updates
Publish Your Newspaper/Website Online
Contact Us : 9666136456

# జీహెచ్ఎంసీ ఎన్నికలే టార్గెట్టా.?

**- సెట్లర్ ఓటు, తెలంగాణ సెంటిమెంటు - రాష్ట్రంలో కొత్త రాజకీయ వ్యూహాలు**

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్ రాజకీయాలు మళ్లీ ఒక ఆసక్తికర మారాయి. రోడ్లు, డ్రైనేజీలు, ట్రాఫిక్, మూసీ ప్రక్షాళన, చెరువుల ఆక్రమణలు వంటి పట్టణ సమస్యలపై జరగాల్సిన చర్చ నెమ్మదిగా ఐడెంటిటీ పాలిటిక్స్ వైపు మళుతోందా? ఇటీవల జరిగిన కొన్ని పరిణామాలు చూస్తే అలాంటి సంకేతాలే కనిపిస్తున్నాయి. అమీర్‌పేట చౌరస్తాలో ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటు చుట్టూ సాగిన చర్చ, తెలంగాణ రాజకీయ విశ్లేషకుడు ప్రొఫెసర్ నాగేశ్వర్ - ఏపీ డిప్యూటి సీఎం పవన్ కళ్యాణ్ మధ్య జరిగిన మాటల యుద్ధం, సోషల్ మీడియాలో మళ్లీ తెరపైకి వచ్చిన తెలంగాణ-ఆంధ్ర భావోద్వేగాలు ఇవన్నీ చూడటానికి విడివిడిగా కనిపించినా, జీహెచ్ఎంసీ ఎన్నికల కోనంలో చూస్తే ఒక పెద్ద రాజకీయ వ్యూహంలో భాగమే అని అనిపిస్తోంది. ఎన్నికలు ఇంకా అధికారికంగా ప్రకటించకపోయినా, రాజకీయ పార్టీలు ఇప్పటికే హైదరాబాద్ ఓటరు మనస్తత్వాన్ని అంచనా వేసే పనిలో పడ్డాయనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది.

**రేపటి అధికారానికి జీహెచ్ఎంసీ ఎన్నికే తొలిమెట్టు..**

తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికల తర్వాత అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే పోరు జీహెచ్ఎంసీ ఎన్నికలే. రాష్ట్ర జనాభాలో కీలక భాగం హైదరాబాద్‌లో నివసిస్తోంది. రాష్ట్ర ఆదాయంలోనూ, రాజకీయ ప్రభావంలోనూ, మీడియా దృష్టిలోనూ హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం ఉంది. హైదరాబాద్‌ను గెలుచుకోవడం అంటే కేవలం కార్పొరేషన్‌ను గెలుచుకోవడం కాదు. అది ఓ పొలిటికల్ నరేటివ్ ను సృష్టించడం. అందుకే కాంగ్రెస్, బీజేపీ,




బీఆర్ఎస్ మూడు పార్టీలూ జీహెచ్ఎంసీని ప్రతిష్ఠాత్మక పోరుగా చూస్తున్నాయి.గతంలో టీడీపీ బలంగా ఉన్న గ్రేటర్ హైదరాబాద్, తర్వాత బీఆర్ఎస్‌కు కోటగా మారింది. అదే జీహెచ్ఎంసీ ఇప్పుడు కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వారికి అనుకూలంగా మారింది. కంటోన్మెంట్,

2లో..

## బెంగాల్‌లో

# ఆగని హింస

**- దీదీ మేనల్లుడిపై రాళ్లు, చెప్పులు, కోడిగుడ్లతో దాడి**



**కోల్కతా (ప్రశ్న న్యూస్)** పశ్చిమ బెంగాల్‌లోని సోనార్‌పూర్‌లో శనివారం మమతా బెనర్జీ మేనల్లుడు, తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ అభిషేక్ బెనర్జీపై దాడి జరిగింది. ఎన్నికల అనంతర హింసాకాండ బాధితుల కుటుంబాలను పరామర్శించడానికి వెళ్లిన సందర్భంగా ఆయనపై గుడ్లు, రాళ్లు విసిరారు. ఇదే సమయంలో బీజేపీ కార్యకర్తలు ఆయనకు వ్యతిరేకంగా 'దొంగ దొంగ' అని నినాదాలు చేశారు. ఈ దాడి నుంచి అభిషేక్‌కు కాపాడేందుకు భద్రత సిబ్బంది తమ హెల్మెట్ ఇచ్చి రక్షణగా నిలిచారు. బీజేపీ కార్యకర్తలే దాడి చేశారని టీఎంసీ ఆరోపించింది. అక్కడ ఉద్రిక్తతలు చోటుచేసుకోవడంతో భద్రతా సిబ్బంది ఆయనను చుట్టుముట్టి రక్షణగా నిలుస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.ఈ ఘటన అనంతరం అభిషేక్ బెనర్జీ మీడియాతో మాట్లాడుతూ ఈ దాడిని బీజేపీయే ప్రోత్సహించిందని ఆరోపించారు. 'ఇదంతా బీజేపీయే ప్రోత్సహించింది. వాళ్లు ఏం చేశారో చూడండి. ఇదేనా వాళ్ల ప్రజాస్వామ్యానికి ఉదాహరణ.

2లో..

## బీఆర్ఎస్‌కు

# సీఎం రేవంత్ సవాల్

**- రైతు డిస్కం ఏర్పాటుచేస్తోన్న తెలంగాణ ప్రభుత్వం**
**- ఉచిత విద్యుత్ ఎత్తేస్తారంటూ బీఆర్ఎస్ ఆరోపణ**
**- హరీష్ రావు విమర్శలపై స్పందించిన రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** రైతు డిస్కం ఏర్పాటు విషయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ చేస్తోన్న ఆరోపణలపై తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్రంగా స్పందించారు. వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టినా, ఉచిత విద్యుత్ ను నిలిపివేసినా తాము ఎన్నికల్లో పోటీచేయబోమని ఒకవేళ మీటర్లు బిగించకుండా ఉచిత విద్యుత్ కొనసాగిస్తే పోటీ నుంచి బీఆర్ఎస్ తప్పుకుంటుందా? అని సవాల్ విసిరారు. దేశంలో తొలిసారి రైతు డిస్కం ఏర్పాటుచేశామని, 24 గంటలూ నాణ్యమైన విద్యుత్ కోసమేనని తెలంగాణ సీఎం స్పష్టం చేశారు.

అంతేకాదు, రైతు పండించే ప్రతి గింజను తమ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని పునరుద్ఘాటించారు. కనీస మద్దతు ధరను నిర్ణయించిన కేంద్రం రైతు పండించిన పంటను కొనుగోలు చేయకపోవడం వల్లే ఈ పరిస్థితి అని అన్నారు. 'రాష్ట్రం కొనుగోలుచేసిన ప్రతి గింజను

2లో..

## బాల్క సుమన్ అరెస్టు

**- వివాదాస్పద వ్యాఖ్యల కేసులో చర్యలు**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక మలుపు. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌ను నాంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అరెస్టు సమయంలో తెలంగాణ భవన్ కేంద్రంగా హైడ్రామా సాగింది. తీవ్ర ఉద్రిక్తత మధ్య ఆయన్ని నాంపల్లి పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. సింగరేణిని తగలబెట్టాలని, మిలిటెంట్ యాక్టివిటీ చేయాలని చేసిన కామెంట్స్ తీవ్ర దుమారం రేపాయి. దీంతో ఆయనపై పలు స్టేషన్స్‌లో కేసులు నమోదు అయ్యాయి. సింగరేణి బొగ్గు గని కార్మికుల సమావేశంలో బాల్క సుమన్ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు ఆయన అరెస్టుకు దారి తీశాయి. సింగరేణిని తగులబెట్టండి, మిలిటెంట్ యాక్టివిటీ చేయాలి. డబ్బులు కావాలంటే ఆఫీస్‌లను తగలబెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కామెంట్స్‌పై ఆనంద్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో

2లో..

## 14 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా

# యోగా కార్యక్రమాలు



**- యోగాంధ్ర- 2026 పై సీఎం చంద్రబాబు సమీక్ష**

**- అన్ని శాఖల సమన్వయం.. కోటి మంది భాగస్వామ్యం**

**- ఒక్కో జిల్లాకు రూ.25 లక్షలు కేటాయింపు - యోగాపై మంతెన సత్యనారాయణ రాజు ప్రత్యేక వీడియోలు**

అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా, ఘనంగా యోగాంధ్ర-2026 నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. జూన్ 21వ తేదీ అంతర్జాతీయ యోగా డే నిర్వహణకు సంబంధించి మంత్రులు, అధికారులతో సీఎం సమీక్ష చేశారు. ఈ సందర్భంగా యోగాంధ్ర 2026పై తలపెట్టిన కార్యక్రమాలపై అధికారులు ప్రజెంటేషన్ ఇచ్చారు. యోగాంధ్ర -2026 కార్యక్రమంలో భాగంగా జూన్ 7 నుంచి 14 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాజధాని అమరావతిలో 25 వేల మందితో నిర్వహించే రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొంటారు. రాజధాని ప్రాంతంలోని కృష్ణా నదీ వంతెనపై యోగా కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. వెస్ట్ బైపాస్ రోడ్

2లో..

## తెలంగాణలో కలవరపెడుతున్న

# సిజేరియన్లు

**- ప్రైవేట్ ఆస్పత్రులతో పాటుగా ప్రభుత్వ ఆస్పత్రులలోనూ**
**- నేషనల్ ఫ్యామిలీ హెల్త్ సర్వే ఫలితాల్లో వెల్లడి**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మాతృత్వం అదో అందమైన అనుభూతి. ఆ అనుభూతి కోసం ఎంతోమంది దంపతులు ఏళ్ల తరబడి ఎదురుచూస్తుంటారు. దేవుడు కరుణిస్తే ఆ దంపతుల ఆనందమే వేరు. వారి ప్రపంచమే మారిపోతుంది. వారింట్లోకి మరో కొత్త మనిషి ప్రవేశిస్తారు. మనిషి ఆశను, ఆలోచనను, బాధ్యతలను

2లో..

## రేవంత్ రెడ్డి

# ఒక రెన్యూవల్ సీఎం

**- తెలంగాణ తెచ్చిన మగోడు, మొనగాడు కేసీఆర్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికలకు ముందు 13 డిక్లరేషన్లు, 6 గ్యారంటీలు, 420 హామీలతో మాయమాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ అధికారం లోకి వచ్చాక అన్ని వర్గాలను నట్టేట ముంచిందని ధ్వజమెత్తారు. ఇందిరాపార్కు వద్ద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ (జేఏసీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాధర్నాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. రేవంత్ రెడ్డి ఒక రెన్యూవల్ సీఎం మాత్రమేనని

3లో..

## డంపింగ్ యార్డులు లేని

# రాష్ట్రంగా ఏపీ మారాలి

**- పల్నాడులో పవన్ కళ్యాణ్ పర్యావరణ మంత్రం!**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యావరణ పరిరక్షణ , స్వచ్ఛత దిశగా సరికొత్త అడుగులు వేస్తున్నారు. శనివారం పల్నాడు జిల్లా కొండవీడులోని జిందాల్ వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంట్‌ను సందర్శించిన ఆయన, చెత్త నుంచి సంపదను సృష్టించడమే లక్ష్యంగా ప్రభుత్వ భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించారు. ముఖ్యంగా రాబోయే గోదావరి

2లో..

## సీఎల్పీ నేతగా డీకే శివకుమార్

# ఎన్నిక ఏకగ్రీవం

**- జూన్ 3న కర్ణాటక సీఎంగా ప్రమాణం**



బెంగుళూరు (ప్రశ్న న్యూస్) ముఖ్యమంత్రి పదవి చేపట్టాలనే డీకే శివకుమార్ ఆశ ఎట్టకేలకు నెరవేరబోతోంది. శనివారం సాయంత్రం జరిగిన కాంగ్రెస్ శాసనసభాపక్షం సమావేశంలో ఆయనను ఎమ్మెల్యేలు తమ నేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కర్ణాటక అసెంబ్లీ కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన ఈ సమావేశంలో సీఎల్పీ నేతగా డీకే పేరును ఆపద్ధర్మ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రతిపాదించారు. ఆయనకు ఎమ్మెల్యేలంతా మద్దతు తెలపడంతో డీకే ఎన్నిక ఏకగ్రీవమైంది. కేంద్ర పరిశీలకులుగా

2లో..

## ముష్కిన్ చెరువు

# కబ్జా బట్టబయలు

**- రూ.5,500 కోట్ల భూకబ్జా కుట్రను భగ్నం చేసిన హైడ్రా**
**- ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమణలను తొలగించిన హైడ్రా**
**- చెరువు అభివృద్ధిపేరిట జరిగిన కబ్జాలకు హైడ్రా చెక్**
**- రెండు నెలల నోటీసు తర్వాత రంగంలోకి దిగిన అధికారులు**

2లో..



# జీహెచ్ఎంసీ ఎన్నికలే టార్గెట్టా.?

జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే అందుకు నిదర్శనం. మరోవైపు బీజేపీ నగరంలో తన బలాన్ని క్రమంగా పెంచుకోవాలని చూస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి అంశం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

### ఎన్టీఆర్ విగ్రహం: రెండు రాష్ట్రాల సెంటిమెంటు

తెలంగాణ ఉద్యమ కాలంలో తరచుగా వినిపించిన "తెలంగాణ సాంస్కృతిక అస్తిత్వం" వాదనకు ఎదురుగా "తెలుగు జాతి ఉమ్మడి వారసత్వం" అనే వాదన మళ్లీ వినిపించింది. ఎన్టీఆర్ కేవలం ఆంధ్రప్రదేశ్ నాయకుడా? లేక మొత్తం తెలుగు జాతికి చెందిన నేతా? అనే చర్చలు కూడా జరిగాయి. తెలంగాణలో ఆంధ్ర పార్టీ నాయకుడి విగ్రహమెందుకని పాశం యాదగిరి లాంటి ఉద్యమకారులు బహిరంగంగా చేసిన వ్యాఖ్యలు తీవ్రచర్చకు దారి తీసింది. వాస్తవానికి ఎన్టీఆర్ ను తెలంగాణ బీజేపీ, కాంగ్రెస్, బీఆరెస్ ఎవరూ బహిరంగంగా ఓన్ చేసుకోలేని పరిస్థితి. రేవంత్ మాత్రం తన ఓపెన్ గా తీసుకున్న నిర్ణయం ఇక్కడి సెటిలర్ ఓటర్లకు నచ్చుతుంది. అదే సమయంలో వ్యతిరేకులనూ ఆకట్టుకునే ప్రయత్నాలు ఇతర పార్టీలు చేయొచ్చు.

### పవన్ కళ్యాణ్ - నాగేశ్వర్ వివాదం: సోషల్ మీడియా నుంచి రాజకీయ చర్చకు

ఇటీవల ప్రొఫెసర్ నాగేశ్వర్ మరియు పవన్ కళ్యాణ్ మధ్య జరిగిన వివాదం కూడా తెలంగాణ–ఆంధ్ర చర్చను మరోసారి తెరమీదకు తెచ్చింది. తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మందుల సామేలు, అనిరుధ్ రెడ్డిలు చేసిన వ్యాఖ్యలు, జనసేన అభిమానులు ప్రెస్ క్లబ్ లో చేసిన ప్రకటనలు పరిస్థితిని కాస్త ఉద్రిక్తంగానే మార్చాయి. కొందరు దీనిని తెలంగాణ మేధావి వర్గం వర్సెస్ ఆంధ్ర రాజకీయ ప్రభావం కోణంలో చూడగా, మరికొందరు పత్రికా స్వేచ్ఛ వర్సెస్ ఫ్యాన్ ఫేర్ అనే కోణంలో విశ్లేషించారు. ఈ వివాదం కొన్ని రోజులుగా సోషల్ మీడియా అజెండాను పూర్తిగా ఆక్రమించింది. ముఖ్యంగా యువతలో, రాజకీయంగా చురుకుగా ఉండే వర్గాల్లో ఈ చర్చ బలంగా సాగుతోంది.

### మళ్లీ తెరపైకి వస్తున్న తెలంగాణ-ఆంధ్ర భావోద్వేగాలు?

తెలంగాణ ఆవిర్భావం తొలుత ఊహించినంత వైరం ఏమీ ఏర్పడలేదు పైగా ఏపీ పెట్టుబడిదారులు మాకు ముఖ్యం అని కేసీఆర్ స్వయంగా ప్రకటించారు కూడా . తర్వాత క్రమంగా అభివృద్ధి, సంక్షేమం, ఉద్యోగాలు, పెట్టుబడులు వంటి అంశాలు ప్రధాన చర్చగా మారాయి. కానీ ఇటీవల కొన్ని పరిణామాలు చూస్తే మళ్లీ ప్రాంతీయ సెంటిమెంటు ప్రధానాంశం కాబోతోందా అనికూడా అనిపించకమానదు. సోషల్ మీడియాలో తెలంగాణ వాదులు, ఆంధ్ర వాదులు అంటూ ఓపెన్ కాలింగ్ మొదలైంది. దాంతో ఇది ఎన్నికల ముందు సహజ రాజకీయ ప్రక్రియేనా? లేక పార్టీల వ్యూహాత్మక ప్రచారంలో భాగమా? అనుమానం కలగక మానదు.

### జీహెచ్ఎంసీలో సెట్లర్ ఓటు ఎంత కీలకం?

హైదరాబాద్ రాజకీయాల్లో "సెట్లర్ ఓటు" అనే పదం కొత్తది కాదు. ముఖ్యంగా కోస్తా ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల నుంచి వచ్చి హైదరాబాద్‌లో స్థిరపడిన లక్షలాది మంది ఓటర్లు నగర ఎన్నికల్లో ప్రభావం చూపే స్థాయిలో ఉన్నారు. ఈ వర్గం ఎటు మొగ్గుచూపితే అటే సీట్లు గెలుస్తారనేది గణాంకాలు చెప్తున్నాయి. ఐతే వీరు తెలంగాణలో అధికారంలో ఉన్న పార్టీవైపే మొగ్గుచూపుతారు అనే మరో విశ్లేషణ కూడా సాగుతోంది. 2009లో కాంగ్రెస్, 2018లో, 2023లో బీఆరెస్, ఇప్పుడు కాంగ్రెస్ వైపు హైదరాబాద్ ఓటరు మొగ్గుచూపడం ఆసక్తికర పరిణామం. అందుకే ఈ వర్గాన్ని ఆకర్షించగలిగితే నగరంలోని అనేక డివిజన్లలో రాజకీయ సమీకరణాలు మారిపోతాయి. అందుకే ప్రతి పార్టీ ఈ వర్గాన్ని దూరం చేసుకునే ధైర్యం చేయదు.

### తెలంగాణ అస్తిత్వ ఓటూ కీలకమే.. కాకపోతే జిల్లాల్లో..

మరోవైపు తెలంగాణ ఉద్యమం ద్వారా రాజకీయంగా చైతన్యం పొందిన వర్గాలు ఇప్పటికీ ఉన్నాయి. తెలంగాణ ఆత్మగౌరవం, తెలంగాణ సంస్కృతి, తెలంగాణ చరిత్ర వంటి అంశాలను ప్రాధాన్యంగా చూసే ఓటర్లు కూడా నగరంలో ఉన్నారు. సెట్లర్లు అంటే కేవలం ఏపీ నుంచి వచ్చి స్థిరపడిన వారు మాత్రమే కాదు తెలంగాణ జిల్లాలనుంచి వచ్చిన వాళ్ళకూ ఇక్కడ గణనీయ ఓట్లున్నాయి. అందువల్ల జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కేవలం సెట్లర్ ఓటు మాత్రమే కాదు, తెలంగాణ గుర్తింపు ఓటు కూడా కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది.

### పార్టీల లెక్కలు ఇలా.. కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ వర్సెస్ బీజేపీ

అధికార పార్టీగా కాంగ్రెస్ నగర అభివృద్ధిని ప్రధాన అజెండాగా తీసుకెళ్లే అవకాశం ఉంది. అదే సమయంలో సెట్లర్ వర్గాలకు దూరం కాదనే సంకేతాలను కూడా పంపే ప్రయత్నం చేయవచ్చు. అందుకు సీఎం రేవంత్ రెడ్డి ప్రధాన బలం.. రేవంత్ కి ఉన్న తెలుగుదేశం నేపథ్యం, వ్యక్తిగత సంబందాలు ఆ పార్టీకి బలం కానున్నాయి. బీజేపీ ఇప్పటికే నగరంలో బలమైన పట్టు సాధిస్తోంది హిందుత్వం, జాతీయతతో పాటు పవన్ కళ్యాణ్ చరిష్మా, తెలుగుదేశం పొత్తును అందుకు అనుకూలంగా వాడుకోబోతోంది. ప్రధాని ఇటీవలి హైదరాబాద్ పర్యటనలో చంద్రబాబు, పవన్ ల ఇంటికి వెళ్లడం, ప్రస్తుత తెలంగాణ – ఆంధ్ర సెంటిమెంటు ద్వారా బీఆరెస్ వ్యతిరేక వర్గాలను ఆకట్టుకునే వ్యూహంలో ఆపార్టీ వుండి. బీఆర్ఎస్‌కు తెలంగాణ గుర్తింపు రాజకీయాలే సహజ బలం. తెలంగాణ ఉద్యమ వారసత్వాన్ని మళ్లీ ప్రజలకు గుర్తు చేస్తూ స్థానిక భావోద్వేగాలను తిరిగి చైతన్యపరిచే ప్రయత్నం చేసే అవకాశం ఉంది. అదే సమయంలో సెటిలర్లకు తాము వ్యతిరేకం కాదు అని చెప్పుకునే విషయంలో మాత్రం వారికి కత్తిమీద సాముగానే కనిపిస్తోంది. సెట్లర్ల ఓటు రేవంత్ – ఎన్డీఏ కూటమి మధ్య చీలితే ఏదైనా లాభం వస్తుందేమో అనే ఆశల్లో కూడా ఆ పార్టీ ఉంది.

### ప్రజాసమస్యలు వెనక్కుపోయినట్టేనా ..

రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో అసలు నరేటివ్ దేనిపై అన్న స్పష్టత మాత్రం ఇంకా రాలేదు మూసీ ప్రక్షాళన పై అభ్యంతరాలు, హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యలు, వరదల నిర్వహణపై జరుగుతుందా? లేక తెలంగాణ అస్తిత్వం, ప్రాంతీయ భావోద్వేగాలపై జరుగుతుందా? అనేది తేలే కీలక దశలో మనమున్నాం. ఇప్పటివరకు జరిగిన పరిణామాలు చూస్తే రెండు అంశాలూ సమాంతరంగా నడుస్తున్నట్లు కనిపిస్తున్నాయి.

జీహెచ్ఎంసీ ఎన్నికలు అధికారికంగా ఇంకా ప్రకటించకపోయినా ఎన్టీఆర్ విగ్రహం వివాదం, పవన్ కళ్యాణ్–నాగేశ్వర్ ఎపిసోడ్, సోషల్ మీడియాలో మళ్లీ వినిపిస్తున్న తెలంగాణ–ఆంధ్ర వాదనలు ఇవన్నీ ఎన్నికల అజెండాను ప్రభావితం చేసే అంశాలుగా మారే అవకాశం ఉంది.

# బాల్క సుమన్ అరెస్టు

నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా 326(జి), 351(3), 353(1)(బి), ఆర్/డబ్ల్యు 61(2)(ఏ), బిఎన్ఎస్4 పీడీపీపీఏ వంటి కఠిన సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. మిలిటెంట్ వ్యాఖ్యలు చేసిన తర్వాత ఆయన అరెస్టు ఖాయమని ప్రచారం జరిగింది. దీంతో బాల్క సుమన్ గత మూడు రోజులుగా తెలంగాణ భవన్‌నే తన ఆవాసంగా మార్చుకున్నారు. ఆయన బయటకు రాగానే అరెస్టు చేయాలని పోలీసులు వ్యూహం రచించారు. భవన్ వెలుపల భారీగా పోలీసులు మోహరించారు. లోపల బీఆర్ఎస్ కార్యకర్తలు, లాయర్లు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీస్ గో బ్యాక్ అంటూ కార్యకర్తల నినాదాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తింది. నోటీసులు ఇవ్వకుండా ఎలా అరెస్టు చేస్తారని బీఆర్ఎస్ లీగల్ సెల్ ప్రశ్నించగా, నాన్‌బెయిల్‌బుల్ కేసులు కాబట్టి నోటీసులు అవసరం లేదని పోలీసులు చెబుతున్నారు. అరెస్టుకు కొద్ది నిమిషాల ముందు బాల్క సుమన్ మీడియా ముందు తన గళాన్ని గట్టిగానే వినిపించారు. ప్రభుత్వం చేస్తున్న మోసాలను, సింగరేణిలో జరుగుతున్న కుంభకోణాలను ప్రశ్నిస్తున్నందుకు తనపై కక్ష సాధింపు చర్యలకు దిగుతున్నారని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో తనపై 250కిపైగా కేసులు ఉన్నాయని, జైలుకు వెళ్లడం తనకు కొత్త కాదని స్పష్టం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి వివేక్ కలిసి కుట్రపూరితంగా తనను జైలుకు పంపి పైశాచికానందం పొందాలని చూస్తున్నారని విమర్శించారు. సింగరేణిలో వందల కోట్ల స్కాములు జరుగుతున్నాయని, వారసత్వ ఉద్యోగాల విషయంలో ప్రభుత్వం మాట తప్పిందని ఆయన దుయ్యబట్టారు. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు అత్యంత కఠినమైనవి. ముఖ్యంగా ప్రభుత్వ ఆస్తుల విధ్వంసానికి ప్రేరేపించడం వంటి సెక్షన్ల వల్ల పదేళ్ల వరకు శిక్ష పడే అవకాశం ఉందని సమాచారం. బీఆర్ఎస్ లాయర్లు మాత్రం ఇవన్నీ అక్రమ కేసులని, బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయిస్తామని చెప్పారు.

# బీఆర్ఎస్‌కు సీఎం రేవంత్ సవాల్

కేంద్రం కొనాలని, లేకుంటే బీజేపీ నేతల ఇళ్ల వద్ద నిరసనలు చేపడతాం' అని హెచ్చరించారు. పంట మార్పిడిపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. హరీష్ రావు చెప్పిన ధరకే బియ్యం అమ్ముతామని, సన్న వడ్లకు రూ.500 బోనస్ కొనసాగిస్తామని రేవంత్ తెలిపారు.

"రైతులకు 24 గంటలు నాణ్యమైన ఉచిత విద్యుత్ అందించేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నాం విద్యుత్ వినియోగాన్ని దీనికి అనుసంధానం చేస్తున్నాం. రైతు డిస్కంతో జవాబుదారీతనం పెరుగుతుంది ఏడాదికి మేము రూ.70 వేల కోట్లు అప్పు చేస్తే రూ.95 వేల కోట్లు రుణాలు తీరుస్తున్నాం కానీ, మేం తీరుస్తున్న అప్పుల గురించి హరీశ్‌రావు మాట్లాడటం లేదు రూ.54 వేల కోట్లు రుణం తీసుకుంటామని ముందే చెప్పాం. ఎఫ్ఆర్బీఎం పరిధి దాటి రుణాలు చేయడానికి అనుమతి లేదు" అని పేర్కొన్నారు. "బీఆర్ఎస్‌లోనే ఉంటానని కేసీఆర్ మీద ఒట్టేసి హరీశ్‌రావు చెప్పాలి. గతంలో వైఎస్సార్ దగ్గరికి హరీష్ వెళ్లారు. ఆయన ఎవరెవరితో మాట్లాడుతున్నారు? ఎవరిని కలుస్తున్నారో నాకు తెలుసు.. కానీ చెప్పను పార్టీ మీటింగ్ వదిలేసి ఆయన ఢిల్లీకి ఎందుకు వెళ్లారు? బీజేపీ, బీఆర్ఎస్‌లు కలిసి పోటీ చేస్తాయనడంలో ఎటువంటి అనుమానమే లేదు" అని అన్నారు. సీబీఎస్ఈలో ప్రశ్నాపత్రాలు తారుమారు చేసిన గ్లోబరీనా కేటీఆర్ బినామీ సంస్థ అని ఆరోపించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, బీజేపీలపై ఆయన విమర్శలు గుప్పించారు. ఈ రెండు పార్టీలు అబద్ధాల పునాదులపై రాజకీయాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. 2034 వరకు తాను తెలంగాణ రాజకీయాల్లోనే ఉంటానని, ప్రజలకు మేలు చేయాలనేది తన ఉద్దేశమని అన్నారు. 2029 ఎన్నికల్లో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ నాయకత్వంలో మళ్లీ కాంగ్రెస్ గెలుస్తుందని, తమది విజయవంతమైన జోడీ అని జోస్యం చెప్పారు. అంతరాష్ట్ర జల వివాదాలను చర్చల ద్వారా సామరస్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని ప్రధాని మోదీ చెబుతున్నారని, కానీ తుమ్మిడి హట్టిపై మాట్లాడేందుకు మహారాష్ట్ర సీఎం సమయం ఇవ్వడం లేదని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు.

# బెంగాల్‌లో ఆగని హింస

నెల కూడా కాలేదు, పోలీసులు ఎక్కడా కనిపించడం లేదు" అని ఆయన అన్నారు. దాడి చేసినవారు తనను చంపడానికే వచ్చారని ఆరోపించిన బెనర్జీ.. ఈ ఘటన మొత్తం కెమెరాలో రికార్డయిందని పేర్కొన్నారు. "వారు నన్ను చంపాలనుకున్నారు. ఈ ఘటన మొత్తం కెమెరాలో రికార్డ్ అయింది. మేము ఈ విషయాన్ని హైకోర్టు దృష్టికి తప్పకుండా తీసుకువస్తాం, గవర్నర్‌కు కూడా తెలియజేస్తాం నేను తప్పకుండా కోర్టును ఆశ్రయిస్తాను" అని ఆయన అన్నారు. తాను తృటిలో తీవ్ర గాయాల నుంచి తప్పించుకున్నానని చెప్పారు. "నా తలకు గాయంకాకుండా తప్పించుకున్నారు అదృష్టవశాత్తు, నేను హెల్మెట్ ధరించాను వారు నా బట్టలు చించి, నా కళ్లజోడు పగలగొట్టారు" అని తెలిపారు. అంతేకాదు, "ఘటనా స్థలంలో పోలీసుల ఉనికి లేదు. వారు మమ్మల్ని చంపాలనుకుంటున్నారు. చంపనివ్వండి నేను చావనైనా చస్తాను కానీ ఇక్కడ నుంచి కదలను" అని ఆయన అన్నారు. తగిన భద్రతా ఏర్పాట్లు చేసే వరకు తాను వెళ్లబోనని తేల్చిచెప్పారు. ఉద్రిక్తతల నడుమ పోలీసు సిబ్బంది, కేంద్ర బలగాలు ఘటనా స్థలానికి చేరుకుని బెనర్జీని రక్షించారు. కలవడానికి వచ్చిన బాధిత కుటుంబాన్ని ఉద్దేశించి బెనర్జీ మాట్లాడుతూ "ఈ పరిస్థితుల్లో వృద్ధులైన సంజు తల్లిదండ్రులను నేను వదిలిపెట్టి వెళ్లను. పోలీసులను సంప్రదించమని నేను మరోసారి మా ప్రతినిధులను కోరతాను" అని అన్నారు. తమ పర్యటన గురించి అధికారులకు తమ పార్టీ ముందుగానే తెలియజేసింది కానీ స్పందించలేదని చెప్పారు. ఈ ఘటనపై టీఎంసీ రాజ్యసభ ఎంపీ డెరెక్ ఓబ్రియన్ స్పందిస్తూ అభిషేక్ బెనర్జీ ప్రాణాలకు ప్రమాదం ఉందని, పోలీసులు ఎక్కడున్నారని ఆయన ప్రశ్నించారు.

# 14 రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా యోగా కార్యక్రమాలు

నిర్మాణంలో భాగంగా నదిపై నిర్మించిన బ్రిడ్జిపై కార్యక్రమం ఇంటర్నేషనల్ యోగా డే జూన్ 21న నిర్వహిస్తారు. అలాగే అదే రోజు జిల్లా కేంద్రాల్లో 1000 మందితో నిర్వహించే కార్యక్రమాల్లో మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు పాల్గొంటారు. యోగాంధ్ర కార్యక్రమాన్ని అన్ని ప్రాంతాల్లో, అన్ని స్థాయిల్లో, అన్ని విభాగాల్లో నిర్వహించాలని సీఎం సూచించారు. మొత్తంగా కలిపి కోటి మంది భాగస్వాములు అయ్యేలా కార్యాచరణ సిద్ధం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న 1.50 లక్షల మంది ట్రైనర్లకు అందనంగా మరో లక్ష మందిని ట్రైనర్లుగా చేసేందుకు అవసరమైన శిక్షణ ఇస్తారు. ఒక జిల్లా ఒక థీమ్ తో 14 రోజుల యోగాంధ్ర నిర్వహిస్తారు. జిల్లాల్లో యోగాంధ్ర నిర్వహణకు జిల్లాకు రూ.25 లక్షల చొప్పున నిధులు కేటాయించారు.

### అన్ని శాఖల సమన్వయం.. కోటి మంది భాగస్వామ్యం

ఆరోగ్య, మానవవనరులు, మునిసిపల్, పంచాయతీ రాజ్, దేవాదాయ, ఐటీ శాఖల సమన్వయంతో యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతి జిల్లాలోని రెండు ప్రముఖ టూరిస్టు ప్రాంతాల్లో అంటే 56 టూరిస్టు కేంద్రాల్లో ప్రత్యేక సెషన్స్ నిర్వహిస్తారు. ఒక రోజు రెండు జిల్లాల చొప్పున 500 మందితో టూరిస్టు ప్రాంతాల్లో యోగా నిర్వహిస్తారు. అలాగే 14 రోజుల పాటు పార్కులు, విద్యా సంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, స్వర్ణ వార్డు, స్వర్ణ గ్రామం కార్యాలయాల్లో యోగాంధ్ర కార్యక్రమాలు నిర్వహిస్తారు. యోగాంధ్ర ఈవెంట్స్ కు గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు అవార్డులు చేస్తారు.

### యోగాపై మంతెన సత్యనారాయణ రాజు ప్రత్యేక వీడియోలు

రాష్ట్ర ప్రభుత్వ యోగా, నాచురోపతి విభాగ సలహాదారు మంతెన సత్యనారాయణ రాజు యోగాంధ్ర నిర్వహణకు సంబంధించి రూపొందించిన పోస్టర్ ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించారు. యోగాపై అవగాహనకు, శిక్షణకు తాను చేపట్టిన కార్యక్రమాలను సత్యనారాయణ రాజు సీఎంకు వివరించారు. 90 ఆసనాల వీడియోలు, 21 ఆరోగ్య సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ఆసనాలు వీడియోలు, రోజు వారీ సాధన కోసం యోగాసనాలు, ప్రాణాయామంపై 7 వీడియోలు, యోగా సందేహాలు ప్రశ్నలు–సమాధానాలపై చేసిన వీడియోలను పబ్లిక్ డొమైనులో పెట్టనున్నట్లు తెలిపారు. మీడియా, సోషల్ మీడియా, వివిధ డిజిటల్ ప్లాట్ ఫామ్స్ ద్వారా వీటిని ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు కార్యాచరణ చేపట్టినట్లు తెలిపారు. 8142404888 నెంబర్ కు హాయ్ అని మెసేజ్ పంపడం, క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా ఈ వీడియోలను డౌన్ లోడ్ చేసుకోవచ్చని సత్యనారాయణ రాజు వివరించారు. సమీక్షలో మంత్రులు నారాయణ, సత్యకుమార్, ఆనం రామనారాయణ రెడ్డి, కందుల దుర్గేష్ తో పాటు సీఎస్ సాయి ప్రసాద్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, కమిషనర్ వీర పాండియన్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ముష్కిన్ చెరువు కబ్జా బట్టబయలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ జలవనరుల పరిరక్షణే ధ్యేయంగా దూసుకుపోతున్న హైడ్రా మరో భారీ ఆపరేషన్‌తో సంచలనం సృష్టించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాల్‌గూడ – నార్సింగి పరిధిలోని ముష్కిన్ చెరువు ఆక్రమణలపై శనివారం ఉక్కుపాదం మోపింది. సుమారు 5,500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడేందుకు హైడ్రా కమిషనర్ రంగంలోకి దిగి, చెరువు మధ్యలో నిర్మించిన అక్రమ కట్టడాలను నేలమట్టం చేశారు. ముష్కిన్ చెరువు పరిరక్షణ పేరుతో జరిగిన ఒక భారీ భూకబ్జా యత్నాన్ని హైడ్రా అధికారులు చాకచక్యంగా అడ్డుకున్నారు. ఒక ప్రముఖ నిర్మాణ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల కింద చెరువును అభివృద్ధి చేస్తామంటూ ముందుకు వచ్చి, అసలు కథ నడిపింది. చెరువు మధ్యలో ఏకంగా ఒక ఆనకట్ట వంటి కట్టడాన్ని నిర్మించి, సుమారు 34.21 ఎకరాల జలవనరును ఆక్రమించుకునేందుకు ప్రయత్నించింది. నిబంధనలను తుంగలో తొక్కి సాగుతున్న ఈ నిర్మాణాలను గుర్తించిన హైడ్రా, వాటిని పూర్తిగా తొలగించి చెరువుకు పూర్వవైభవం తెచ్చే పనిలో పడింది.

### రూ. 5,500 కోట్ల భూమికి రక్షణ కవచం

హెచ్ఎండిఏ లెక్కల ప్రకారం ముష్కిన్ చెరువు 52.20 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. అయితే రెవెన్యూ రికార్డుల ప్రకారం ఇది 59.11 ఎకరాల వరకు ఉండగా, ఇందులో 20.23 ఎకరాలు ప్రభుత్వ భూమిగా ఉంది. ఈ భూమిపై కన్నేసిన రియల్టర్లు, పేదల పేరుతో అక్కడ గుడిసెలు వేయించి కబ్జాకు తెరలేపారు. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం ఈ భూమి విలువ అక్షరాలా 5,500 కోట్ల రూపాయలు. ఇంతటి భారీ విలువైన ప్రభుత్వ ఆస్తిని కాపాడేందుకు హైడ్రా శనివారం నుంచి చెరువు చుట్టూ ఫెన్సింగ్ వేసే పనులను యుద్ధ ప్రాతిపదికన ప్రారంభించింది.

### పేదల ముసుగులో రియల్టర్ల మాయాజాలం

చెరువు ఎఫ్‌టిఎల్ పరిధిలో గుడిసెలు వేయించి, ఆ భూమిని ఆక్రమించుకోవాలని చూసిన రియల్టర్ల వ్యూహానికి హైడ్రా చెక్ పెట్టింది. అక్కడ నివసిస్తున్న వారికి గత రెండు నెలల క్రితమే నోటీసులు ఇచ్చి, ఖాళీ చేసేందుకు సమయం ఇచ్చింది. హైడ్రా హెచ్చరికలతో గుడిసెల్లోని వారు స్వచ్ఛందంగా ఖాళీ చేసి వెళ్లిపోవడంతో, అధికారులు శనివారం ఎలాంటి ఆటంకం లేకుండా క్లీన్ స్వీప్ చేశారు. చెరువు మధ్యలో పోసిన మట్టి కట్టలను, అక్రమంగా నిర్మించిన ఎంబ్యాంక్‌మెంట్‌ను జేసీబీలతో తొలగించి నీటి ప్రవాహానికి అడ్డులేకుండా చేశారు.

### నిబంధనల ఉల్లంఘనపై ఉక్కుపాదం

చెరువు అభివృద్ధి పనులు చేపట్టిన సంస్థ పర్యావరణ నిబంధనలను ఘోరంగా ఉల్లంఘించినట్లు అధికారులు గుర్తించారు. చెరువు విస్తీర్ణాన్ని తగ్గించి, మిగిలిన భూమిని కమర్షియల్ ప్రయోజనాల కోసం వాడుకోవాలనే కుట్ర ఇందులో స్పష్టంగా కనిపిస్తోందని హైడ్రా వర్గాలు తెలిపాయి. ఎఫ్‌టిఎల్ సరిహద్దులను నిర్ణయించి, ఏ ఒక్క అంగుళం భూమి కూడా అక్రమార్కుల పాలు కాకుండా పక్కాగా ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ భూమితో పాటు ఎక్సల్ పట్టా భూముల్లో జరుగుతున్న అక్రమ కట్టడాలపై కూడా హైడ్రా దృష్టి సారించింది. ముష్కిన్ చెరువు రక్షణ కోసం హైడ్రా చేపట్టిన ఈ భారీ ఆపరేషన్ రియల్ ఎస్టేట్ మాఫియాకు గట్టి హెచ్చరికగా మారింది. చెరువుల పునరుద్ధరణ పేరుతో భూములను మింగేయాలని చూస్తే పరిణామాలు ఎంత తీవ్రంగా ఉంటాయో ఈ ఘటన నిరూపించింది. శనివారం రోజంతా సాగిన ఈ ఆపరేషన్‌తో గండిపేట పరిసర ప్రాంతాల్లో భూబకాసురుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. నగరంలోని మరిన్ని జలవనరులను కాపాడేందుకు హైడ్రా తన తదుపరి లక్ష్యాలను సిద్ధం చేసుకుంటోంది.

# సీఎల్పీ నేతగా డీకే శివకుమార్ ఎన్నిక ఏకగ్రీవం

వచ్చిన కర్ణాటక వ్యవహారాల ఇంఛార్జ్ రణ్‌దీప్ సూర్జేవాలా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సమక్షంలో సమక్షంలో సీఎల్పీ నేత ఎన్నిక జరిగింది. అనంతరం డీకే ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు పరిశీలకులు ప్రకటించారు. ఎటువంటి నాటకీయ పరిణామాలకు చోటులేకుండా కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం ముగిసింది. కాంగ్రెస్‌కు చెందిన 138 మంది ఎమ్మెల్యేలు హాజరై డీకేను ఎన్నుకున్నారు. అయితే, జూన్ 3న శివకుమార్ ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుందని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

ఇక, కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలకు సరిగ్గా రెండేళ్లే ఉండటంతో డీకే నాయకత్వంలో ఏర్పడే కొత్త ప్రభుత్వానికి క్యాబినెట్ కూర్పుపై ఇబ్బంది ఎదురవకూడదనేది కాంగ్రెస్ అధిష్ఠానం ఆలోచన. కొత్త సీఎం ప్రమాణ స్వీకారం చేసిన రెండు మూడ్రోజుల్లోనే పాలనను పరుగులు పెట్టించాలన్నది హైకమాండ్ లక్ష్యం. ఇందు కోసమే ఢిల్లీలో గత రెండు రోజుల నుంచి మంత్రివర్గ కూర్పుపై ముమ్మర కసరత్తు చేశారు. క్యాబినెట్ కూర్పుపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని డీకే చెప్పినా వడబోత పూర్తయినట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రితో పాటు మంత్రివర్గమంతా ప్రమాణస్వీకారం చేస్తుందా? లేదంటే సాంకేతికంగా ఐదారుగురు బాధ్యతలు తీసుకుంటారా? అన్నది మరికొద్ది గంటల్లోనే తేలిపోనుంది. మంత్రివర్గంలో ఇప్పటికే సిద్ధరామయ్య తన కుమారుడు యతీంద్రకు బెర్త్‌ను ఖాయం చేసుకోగా ఆయన క్యాబినెట్‌లు మంత్రులంతా మరోసారి చోటు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలా ఉండగా, సీఎల్పీ సమావేశానికి బయలుదేరి వెళ్తుండగా డీకే శివకుమార్ అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో ఆయన నివాసం వద్దకు చేరుకున్నారు. ఈ సందర్భంగా మీడియా ముఖ్యమంత్రిగా జూన్ 3న ప్రమాణస్వీకారం చేయనున్నారా? అడిగితే 'థర్డ్ థర్డ్' అంటూ డీకే బదులిచ్చారు.

# తెలంగాణలో కలవరపెడుతున్న సిజేరియన్లు

రెట్టింపు చేయటమే కాదు సంతోషాన్ని, ఆనందాన్ని మూడింతలు చేసేవారే పిల్లలు. అయితే పిల్లల ప్రసవానికి సంబంధించి జాతీయ ఆరోగ్య శాఖ వెల్లడించిన గణాంకాలు ఇప్పుడు కలవరపెడుతున్నాయి. పరిస్థితులు అలా మారుతున్నాయో, లేదా డాక్టర్ల అత్యాశ కారణమో తెలియదు కానీ.. ప్రసవాల్లో సిజేరియన్ల సంఖ్య పెరుగుతోంది. మరీ ముఖ్యంగా తెలంగాణ రాష్ట్రంలో ఈ సంఖ్య ఎక్కువగా ఉందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. జాతీయ ఆరోగ్య శాఖ నేషనల్ హెల్త్ సర్వే గణాంకాల ప్రకారం తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న ప్రతి పది డెలివరీలలో ఆరు సిజేరియన్లే ఉన్నాయనే చేదు నిజం ఆందోళన రేకెత్తిస్తోంది. జాతీయ సగటుతో పోలిస్తే తెలంగాణలో ఎక్కువగా ఉండటం మరింత కలవర పెడుతోంది. దేశంలోనే తెలంగాణలో ఎక్కువగా సిజేరియన్లు జరుగుతున్నట్లు కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ విడుదల చేసిన నేషనల్ హెల్త్ సర్వే ఫలితాల్లో వెల్లడైంది. ఆరోగ్య రంగానికి సంబంధించి అనేక రంగాలలో తెలంగాణలో ముందున్నప్పటికీ ఈ సీ సెక్షన్ల విషయంలో మాత్రం లెక్కలు కలవరపెడుతున్నాయి. తెలంగాణలో 98.8 శాతం డెలివరీ కేసులు ఆస్పత్రులలోనే జరుగుతున్నట్లు లెక్కలు చెప్తున్నాయి. ఈ విషయంలో జాతీయ సగటు 90.6 శాతం కంటే తెలంగాణ ముందుంది.

అయితే వాటిలో 62. 2 శాతం డెలివరీలు సిజేరియన్ల రూపంలో జరగటం మాత్రం ఆందోళన రేకెత్తిస్తోంది. ఇక సిజేరియన్లకు సంబంధించి జాతీయ సగటు 27.2 శాతంగా ఉంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి సిజేరయన్లు 52.2 శాతంగా ఉన్నట్లు గణాంకాలు వెల్లడించాయి. ఈ విషయంలో నాగాలాండ్ 13.2 శాతంతో అన్నింటి కంటే ముందుంది. తెలంగాణలోని ప్రైవేట్ ఆస్పత్రులలో జరిగే డెలివరీలలో 83.9 శాతం సిజేరియన్లే ఉన్నాయట. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా సిజేరియన్ల వాటా 48.1 శాతం కావటం గమనార్హం. ఈ విషయంలో జాతీయ సగటు 16.9 శాతంగా ఉంది. ఇక గర్భ నిర్ధారణ అయిన తర్వాత మొదటి వంద రోజుల వరకూ ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడే గర్భిణులు తెలంగాణలో ఎక్కువగా ఉన్నారు. తెలంగాణలోని 81 శాతం మంది గర్భిణులు ఈ మాత్రలను వాడుతున్నారు. ఈ విషయంలో జాతీయ సగటు 54.9 కంటే తెలంగాణ చాలా ముందుంది.

# డంపింగ్ యార్డులు లేని రాష్ట్రంగా ఏపీ మారాలి

పుష్కరాలను కాలుష్య రహితంగా నిర్వహించడంతో పాటు, రాష్ట్రాన్ని డంపింగ్ యార్డ్ రహిత ఏపీగా తీర్చిదిద్దడమే తన ఆశయమని ఆయన స్పష్టం చేశారు. "చెత్త అనేది వ్యర్థం కాదు అది విద్యుత్తును ఇచ్చే ఇంధన ప్రత్యామ్నాయం" అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. కొండవీడులోని జిందాల్ ప్లాంట్‌ను సందర్శించిన సందర్భంగా ఆయన చెత్త నుంచి విద్యుత్తును తయారు చేసే ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రస్తుతం రాష్ట్రంలో రోజువారీ 7,200 టన్నుల పొడి చెత్త ఉత్పత్తి అవుతోందని, దీన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటే ఇంధన అవసరాలు తీరడంతో పాటు పర్యావరణం కూడా పరిరక్షించబడుతుందని అన్నారు. కొండవీడు ప్లాంట్ ద్వారా ఇప్పటికే 20 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుండగా, విశాఖలో 15 మెగావాట్లు ఉత్పత్తి అవుతోందని ఇదే తరహాలో కాకినాడ, నెల్లూరు, కడప, కర్నూలు, విజయవాడ, తిరుపతి ప్రాంతాల్లో మరో 6 ప్లాంట్లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉందని వెల్లడించారు.

### కాలుష్య రహిత గోదావరి పుష్కరాలకు భారీ ప్లాన్

రానున్న గోదావరి పుష్కరాల నిర్వహణలో చెత్త, కాలుష్య నిర్వహణపై పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. పుష్కరాలతో నేరుగా సంబంధం ఉన్న 268 గ్రామ పంచాయతీల్లో ప్రత్యేక వర్క్ షాపులు నిర్వహించి అధికారులకు, సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని నిర్ణయించారు. నదిలోకి ఎటువంటి వ్యర్థాలు చేరకుండా జిందాల్ అనుసరిస్తున్న ఆధునిక విధానాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తామన్నారు. నదిని అందంగా, పవిత్రంగా ఉంచేందుకు పంచాయతీలను భాగస్వామ్యం చేస్తూ, నిపుణుల సూచనలతో పక్కా ప్రణాళికను సిద్ధం చేస్తున్నట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు.

### సింగపూర్, ఇండోర్ మోడల్స్‌పై అధ్యయనం

చెత్త సేకరణ నిర్వహణలో ప్రపంచ దేశాలు, ఇతర రాష్ట్రాల విజయగాథలను ఏపీలో అమలు చేయాలని పవన్ కళ్యాణ్ భావిస్తున్నారు. సింగపూర్‌లో 90 శాతం చెత్తను కాల్చి విద్యుత్ ఉత్పత్తి చేసే విధానాన్ని, అలాగే దేశంలోనే అత్యంత స్వచ్ఛమైన నగరంగా పేరొందిన మధ్యప్రదేశ్ లోని ఇండోర్ మున్సిపల్ మోడల్‌ను ఆయన ప్రస్తావించారు. ప్రతి 100 కిలోమీటర్లకు ఒక వేస్ట్ టూ ఎనర్జీ ప్లాంటును ఏర్పాటు చేయడం ద్వారా మున్సిపాలిటీలతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని చెత్తను కూడా సులభంగా ప్రాసెస్ చేయవచ్చని, తద్వారా రాష్ట్రాన్ని డంపింగ్ యార్డులు లేని రాష్ట్రంగా మార్చవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

### యువతకు ఉపాధి.. పంచాయతీలకు ఆదాయం

ఈ ప్లాంట్ల ఏర్పాటు కేవలం పారిశుధ్యానికే పరిమితం కాకుండా, ఆర్థిక ప్రయోజనాలను కూడా కల్పిస్తుందని పవన్ కళ్యాణ్ వివరించారు. ఒక మెగావాట్ విద్యుత్ తయారీ ప్లాంట్‌కు సుమారు రూ. 25 కోట్ల ఖర్చు అవుతుందని, దీనివల్ల స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. అలాగే చెత్తను వేరు చేయడం ద్వారా పంచాయతీలు అదనపు ఆదాయాన్ని పొందే మార్గాలను అన్వేషించాలని సూచించారు.

పూలు, పండ్లు, ఆహార వ్యర్థాల ద్వారా బయో గ్యాస్ ఉత్పత్తి చేసే బయో మిథలైజేషన్ ప్లాంట్లపై కూడా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. "చెత్తను వేరు చేయడంపై ప్రజల్లో అవగాహన రావాలి" అని పవన్ కళ్యాణ్ ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. ప్రతి గ్రామంలో క్లస్టర్ల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రజలను ఈ ప్రక్రియలో భాగస్వాములను చేయాలని అధికారులను కోరారు. జిందాల్ ప్లాంట్ ఆపరేషన్స్ హెడ్ ఎం.వి. చారి రూపొందించిన ప్రత్యేక నివేదికపై త్వరలోనే పూర్తిస్థాయి ప్రెజెంటేషన్ ఇవ్వాలని పవన్ కోరారు.

# రేవంత్ రెడ్డి ఒక రెన్యూవల్ సీఎం

చెప్పుకొచ్చారు. 2028లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడటం ఖాయమని 50 వేల మందిని కాంట్రాక్టర్లుగా తీర్చిదిద్దుతాం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పుకొచ్చారు.

### కాంట్రాక్టుల్లో రిజర్వేషన్లు ఇస్తామని దగా చేసిన కాంగ్రెస్

ఎన్నికల ముందు చేవెళ్ల, కామారెడ్డి డిక్లరేషన్ల పేరుతో ప్రభుత్వ కాంట్రాక్టులలో ఎస్సీలకు 18 శాతం, ఎస్టీలకు 12 శాతం, బీసీలకు 42 శాతం (మొత్తం 72 శాతం) రిజర్వేషన్లు ఇస్తామని నమ్మబలికారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తు చేశారు. కానీ అధికారం లోకి వచ్చాక 72 శాతం కాదు గదా, 72 పైసలు కూడా ఈ వర్గాలకు ఇవ్వకుండా అడ్డగోలు జీవోలను తెచ్చారని మండిపడ్డారు. చివరికి గురుకుల పాఠశాలల్లో స్థానిక చిన్న కాంట్రాక్టర్లు సరఫరా చేసే కూరగాయలు, చికెన్, పాలు, బ్రెడ్ వంటి వాటిని కూడా దక్కకుండా చేస్తూ 'జీవో నెం.17' తీసుకువచ్చి, ఆ టెండర్లను పెద్ద కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. చిన్న కాంట్రాక్టర్లను రోడ్లపైకి తెచ్చిన ఈ జీవో 17 రద్దయ్యే వరకు, బడుగు బలహీన వర్గాలకు కాంట్రాక్టులు దక్కే వరకు పోరాటం ఆపేది లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు.

### టెండర్లపై శ్వేతపత్రం కోసం డిమాండ్

ఇవాళ రాష్ట్రంలో కాంట్రాక్టులు కేవలం ఇద్దరికే దక్కుతున్నాయని, రేవంత్ రెడ్డి బామ్మర్దికి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కొడుకుకే అన్ని కాంట్రాక్టులు ఇస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. సొంత నియోజకవర్గం కొడంగల్ – నారాయణ పేట ఎత్తిపోతల పథకానికి సంబంధించిన రూ.4 వేల కోట్ల కాంట్రాక్టును తన అనుయాయులకే ఇచ్చుకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో కేవలం వాళ్ల బంధువులకే కాకుండా, బీజేపీ ఎంపీ సీఎం రమేష్‌కు రూ.1300 కోట్ల కాంట్రాక్టులు ఇస్తున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ రెడ్డి ఇప్పటివరకు రూ.4 లక్షల కోట్ల అప్పు చేశారని, అందులో రూ.4 అయినా ఎస్సీ, ఎస్టీ, బీసీ కాంట్రాక్టర్లకు ఇచ్చారా అని ప్రశ్నించారు. చిన్న కాంట్రాక్టర్లకు విడుదల చేసిన నిధులు మరియు చేసిన అప్పులపై శ్వేతపత్రం విడుదల చేసే దమ్ము రేవంత్ సర్కార్‌కు ఉందా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు.

### రేవంత్ రెడ్డి ఒక 'రెన్యూవల్ సీఎం' మాత్రమే

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేమెంట్ కోటాలో గద్దెనెక్కారని, ఆయన ఒక రెగ్యులర్ సీఎం కాదని, కేవలం 'రెన్యూవల్ సీఎం' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ఢిల్లీ కాంగ్రెస్ హైకమాండ్‌కు నెలనెలా కప్పం (డబ్బులు) పంపి తన కుర్చీని కాపాడుకుంటున్నారని, ఢిల్లీకి బ్యాగులు మోసుకుంటూ పోయినన్ని రోజులు మాత్రమే ఆయన ఉద్యోగం ఉంటుందని వ్యాఖ్యానించారు. తెలంగాణా బడుగులకు తీవ్ర అన్యాయం జరుగుతున్నా ఢిల్లీ హైకమాండ్ మౌనంగా ఉండటానికి ఇదే కారణమన్నారు. ఈ ద్రోహానికి రేవంత్ రెడ్డితో పాటు రాహుల్ గాంధీని, మల్లికార్జున ఖర్గేని కూడా నిలదీయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు.

### కేసీఆర్ హయాంలో సంపద సృష్టి - అద్భుత ప్రగతి

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేసీఆర్ గారు 'సంపద సృష్టించాలి– పేదలకు పంచాలి' అనే దృక్పథంతో పనిచేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నాడు చిన్న చిన్న కాంట్రాక్టర్లను ఆదుకుని గౌరవంగా నిలబెట్టారని గుర్తు చేశారు. కేసీఆర్ అప్పులు చేసి 1000కి పైగా గురుకులాలు కట్టించి, 6.50 లక్షల మంది బడుగు విద్యార్థులకు ఒక్కొక్కరిపై రూ.1.20 లక్షల నుండి రూ.1.25 లక్షల వరకు ఖర్చు పెట్టి కార్పొరేట్ స్థాయి ఉచిత విద్య, బూట్లు, బట్టలు, నాణ్యమైన భోజనం అందించారని పేర్కొన్నారు. అప్పులతోనే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టారని, జిల్లాకో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీ తెచ్చారని, 24 గంటల కరెంట్, కేసీఆర్ కిట్, 15 లక్షల మంది ఆడబిడ్డలకు మేనమామ కట్నంగా కల్యాణలక్ష్మి కింద ఆర్థిక సాయం అందించారని తెలిపారు. రైతులకు రూ.72 వేల కోట్ల రైతుబంధు సాయాన్ని నేరుగా ఖాతాల్లో వేశారని గుర్తు చేశారు. ముఖం బాగాలేక అద్దం పగులగొట్టుకున్న చందంగా తాము చేతగాక కేసీఆర్ అప్పులు చేశాడని రేవంత్ రెడ్డి అవాకులు చవాకులు పేలుతున్నాడని మండిపడ్డారు. హద్దుమీరి మాట్లాడితే ఊరుకునేది లేదని, "తెలంగాణ తెచ్చిన మగోడు, మొనగాడు కేసీఆర్" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గర్వంగా ప్రకటించారు.

### 2028లో మన ప్రభుత్వమే వస్తుంది

రాష్ట్రంలో మక్కలు, వడ్లు కొనుగోలు కాక రైతులు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, ఇవాళ ఏ ఒక్క ఊరికైనా కాంగ్రెస్ వాళ్లు వెళ్లే ధైర్యం ఉందా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. ఎలక్షన్లు ఎప్పుడు వస్తాయా, ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి కర్రుకాల్చి వాతపెట్టి, బొంద పెట్టాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. మైనర్ బాలికకు అన్యాయం జరిగితే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ గారు వదిలిపెట్టకుండా ఎట్లా పోరాడారో, బడుగుల సమస్యలపై కూడా అలాగే పోరాడతామన్నారు. బడుగు వర్గాల సమస్యలపై అధికారులకు, మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వాలని, ఒకవేళ వాళ్ళు వినకపోతే భవిష్యత్తులో జంతర్ మంతర్ లేదా ఢిల్లీ వేదికగానైనా పోరాడుతామన్నారు. 2028లో తప్పకుండా మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని, నాడు 10 వేల మంది కాదు, దాదాపు 50 వేల మంది బడుగు, బలహీన వర్గాల యువకులను కాంట్రాక్టర్లుగా తీర్చిదిద్దే బాధ్యతను కేసీఆర్ తీసుకుంటారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభయమిచ్చారు.

## యువతకు ఉపాధి కల్పించమే ధ్యేయంగా

## ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పని చేస్తోంది...

**- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు**

బాలాజీ కాలనీలోని ఎస్ విసిసి డిగ్రీ కాలేజిలో శుక్రవారం ఉదయం జాబ్ మేళాను ప్రారంభించిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు . జాబ్ మేళాలో పాల్గొన్న 22 ఎం ఎన్ సి కంపెనీలు 800 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించడం సంతోషం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గారు. జాబ్ మేళాలను యువత ఉపయోగించుకోవాలని కోరిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

.ఈ కార్యక్రమం లో బిజెపి తిరుపతి జిల్లా అధ్యక్షులు సామంచి శ్రీనివాస్ , బిజెపి సీనియర్ నాయకులు పొనగంటి భాస్కర్ , రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వర ప్రసాద్, మరియు ఎన్డీఏ కూటమి నాయకులు, స్కిల్ డెవలప్మెంట్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## జూన్ 2న శ్రీ వేణుగోపాలస్వామివారి

## ఆలయంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

కార్వేటినగరంలోని శ్రీ రుక్మిణీ, సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివారి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలకు ముందు నిర్వహించే కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం జూన్ 2వ తేదీ ఉదయం 7.30 గంటల నుండి 11 గంటల వరకు వైభవంగా జరుగనుంది. ఈ ఏడాది బ్రహ్మోత్సవాలు జూన్ 6 నుండి 14వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

ఆలయ సంప్రదాయం ప్రకారం బ్రహ్మోత్సవాలకు ముందు ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజా సామగ్రి తదితరాలను పవిత్ర జలాలతో శుద్ధి చేస్తారు. అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డకర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలీగడ్డ వంటి సుగంధ ద్రవ్యాలతో తయారు చేసిన పవిత్ర జలాన్ని ఆలయం అంతటా ప్రోక్షణం చేస్తారు. ఈ మహోన్నత కార్యక్రమం అనంతరం ఉదయం 11.30 గంటల నుండి భక్తులను స్వామివారి సర్వ దర్శనానికి అనుమతించనున్నారు.

## బిఆర్ఎస్ నేత చెన్నూరు

## మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్

**హైదరాబాద్**బిఆర్ఎస్ నేత చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ను తెలంగాణ భవన్ దగ్గర పోలీసులు అరెస్ట్ చేసారు. తరువాత నాంపల్లి పీఎస్ కు తరలించారు. ఇటీవల జరిగిన ఓ సమావేశంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బాల్కసుమన్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు, 3 రోజుల క్రితం సింగరేణిపై చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో ఈరోజు ఉదయం పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

ఇటీవల సింగరేణి జీఎం కార్యాలయాన్ని తగలబెట్టాలంటూ బాల్క సుమన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు., ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్యకర్తలు మిలిటెంట్ తరహాలో ఉధృత పోరాటాలు చేయాలని ఆయన పిలుపుని చ్చారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా, ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేయాలనే ఉద్దేశంతో ఈ వ్యాఖ్యలు ఉన్నాయంటూ నమోదైన కేసుల ఆధారంగానే పోలీసులు ఈ రోజు ఆయనను అదుపులోకి తీసుకున్నారు.

బాల్క సుమన్ అరెస్ట్ వార్తతో నాంపల్లి కోర్టు పరిసరాల్లో పోలీసుల బందోబస్తును భారీగా పెంచారు.మరోవైపు తన అరెస్ట్ వార్తలను మాత్రం బాల్క సుమన్ ఖండించారు. తాను తెలంగాణ భవన్లోనే ఉన్నానని, అరెస్టు చేస్తే చట్టపరంగా ఎదుర్కొంటానని తెలిపారు.

## చిత్తూరు జిల్లా వ్యాప్తంగా

## కార్డన్ అండ్ సెర్చ్ కార్యక్రమాలు

**చిత్తూరు** ప్రజల భద్రత, రక్షణను ప్రధాన లక్ష్యంగా తీసుకొని, నేరాలు మరియు అక్రమ రవాణాను అరికట్టేందుకు చిత్తూరు జిల్లా వ్యాప్తంగా విస్తృతమైన కార్డన్ ు సెర్చ్ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అనుమానాస్పద వ్యక్తులపై తనిఖీలు, వాహనాల పరిశీలన, నేరస్థుల కదలికలపై పర్యవేక్షణ, అక్రమ రవాణా నిరోధక చర్యలు చేపట్టారు. ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశ్యం నేరాలను ముందస్తుగా అరికట్టి, ప్రజల్లో భద్రతా వాతావరణాన్ని బలపరచడం. ప్రతి ప్రాంతంలో పోలీసుల సాన్నిధ్యం స్పష్టంగా కనిపించేలా చర్యలు తీసుకోవడం ద్వారా, అసాంఘిక కార్యకలాపాలను నిరోధించడమే ఈ ఆపరేషన్ యొక్క ముఖ్య లక్ష్యం అని అధికారులు పేర్కొన్నారు.ప్రజలు తమ పరిసరాల్లో అనుమానాస్పదంగా తిరిగే వ్యక్తులు లేదా వాహనాలను గమనిస్తే, వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా రహస్యంగా ఉంచబడతాయని భరోసా ఇచ్చారు. అదేవిధంగా, ఏవైనా సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పోలీసుల సహాయాన్ని పొందవచ్చని సూచించారు.ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచే దిశగా హెల్మెట్ అవేర్నెస్ మరియు రోడ్ సేఫ్టీ అవేర్నెస్ కార్యక్రమాలు కూడా నిర్వహించబడినవి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి ప్రయాణించాలని, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పోలీసులు ప్రజలకు సూచించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాలకు ప్రమాదంగా మారుతుందని తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా పోలీసు విభాగం సమన్వయం, స్థానిక ప్రజల సహకారం తో ఈ కార్డన్ ు సెర్చ్ ఆపరేషన్ విజయవంతంగా పూర్తి అయింది. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో కూడా నిరంతరంగా కొనసాగుతాయని అధికారులు వెల్లడించారు.

## డీఎస్సీ నియామకాలపై వైసీపీ ఆరోపణలను

## ఖండించిన డీఎస్సీ అభ్యర్థులు, టీడీపీ నేతలు

**తిరుపతి** డీఎస్సీ నియామకాలపై వైసీపీ ఆరోపణలను డీఎస్సీ అభ్యర్థులు, టీడీపీ నేతలు ఖండించారు. మెగా డీఎస్సీతో 16,347 మందికి కూటమి ప్రభుత్వం ఉద్యోగాలు కల్పించింది. డీఎస్సీ పూర్తిగా పారదర్శకంగా జరిగింది.. లంచాల ఆరోపణలు అవాస్తవం. ఉద్యోగాలు అడ్డుకునేందుకు కోర్టుల్లో కేసులు వేయడం దుర్మార్గమని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ను కూడా అడ్డుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. స్పోర్ట్స్ కోటా నియామకాలు నిబంధనల ప్రకారమే జరిగాయని స్పష్టం. ఏళ్ల తరబడి కష్టపడి ఉద్యోగాలు సాధించాం.. మమ్మల్ని అవమానించొద్దని డీఎస్సీ అభ్యర్థులు అన్నారు. ఉపాధ్యాయులను, డీఎస్సీ ఎంపికైన వారిని రాజకీయాల్లోకి లాగొద్దని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు అన్నారు. డీఎస్సీ నియామకాలపై నిరాధార ప్రచారం ఆపాలని డిమాండ్ చేసారు.శ్యాప్ చైర్మన్ రవి నాయుడు మాట్లాడుతూ భవిష్యత్తు ఉద్యోగ నియామకాలను అడ్డుకుంటే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు.

## మార్నింగ్ వాక్‌కు వెళ్లే మహిళలే లక్ష్యం

మత్తుకు బానిసై దోపిడీలకు పాల్పడిన ముఠా అరెస్ట్సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో మత్తుకు బానిసలైన నలుగురు యువకులు దోపిడీలకు పాల్పడుతూ చివరకు పోలీసులకు చిక్కారు. ఎల్లమ్మబండకు చెందిన ఈ యువకులు ఒకవైపు ఆటో నడుపుతూ, వెల్డింగ్ పనులు చేసుకుంటూనే జల్సాలకు అలవాటు పడి ఈజీ మనీ కోసం నేరాల బాట పట్టారు.గత నెల రోజులుగా ఉదయం మార్నింగ్ వాక్‌కు వెళ్లే మహిళలను లక్ష్యంగా చేసుకుని, ఒంటరిగా వెళ్తున్న వారి మెడలోని బంగారు గొలుసులను లాక్కొని పరారవుతున్నారు. బాధితుల ఫిర్యాదుల మేరకు కేసు నమోదు చేసిన జీడిమెట్ల పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు.సీసీ కెమెరాల ఫుటేజ్ ఆధారంగా నిందితుల కదలికలను గుర్తించిన పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి నలుగురు సభ్యుల ముఠాను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి దోచుకున్న బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ డీసీపీ కోటి రెడ్డి జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన జీడిమెట్ల పోలీస్ సిబ్బందిని ఆయన అభినందించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

## కొట్యా తండాలో పోలీసుల

## కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం







**మహబూబాబాద్** జిల్లా ఎస్పీ డా. శబరీష్ ఐపీఎస్ ఆదేశాల మేరకు మరిపెడ పోలీస్ స్టేషన్ పరిధిలోని కొట్యా తండా గ్రామానికి చెందిన చావుల్లా తండా, జాలి తండా, అర్లగడ్డ తండాలలో ఈ రోజు కమ్యూనిటీ కాంటాక్ట్ మరియు ఏరియా డామినేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం 5:30 గంటల నుంచి 7:30 గంటల వరకు ఇంటింటి తనిఖీలు చేపట్టి సుమారు 100 ఇళ్లు పరిశీలించారు.తనిఖీల్లో రిజిస్ట్రేషన్, నంబర్ ప్లేట్లు, పత్రాలు లేని 10 వాహనాలను గుర్తించి విచారణకు తీసుకున్నారు. అలాగే 400 కిలోల నల్ల బెల్లం, 50 లీటర్ల గుడుంబా, 50 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నారు. గుడుంబా తయారీకి సిద్ధం చేసిన 1000 లీటర్ల బెల్లం పులుసును గుర్తించి ధ్వంసం చేశారు. అనంతరం గ్రామస్తులతో అవగాహన సమావేశం నిర్వహించి చోరీలు, రోడ్డు భద్రత, హెల్మెట్ వినియోగం, సైబర్ నేరాలు, గంజాయి నివారణ, సీసీ కెమెరాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో 25 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

## ప్రైవేటు బస్సులో మంటలు..ప్రయాణికులు క్షేమం

**నల్గొండ** నల్గొండ జిల్లా చిట్యాల మండలం పెద్దకాపర్తి సమీపంలో హైదరాబాద్ నుంచి కాకినాడ వెళ్తున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో శనివారం తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. డ్రైవర్ అప్రమత్తమై బస్సును ఆపడంతో అందులోని 36 మంది ప్రయాణికులు సురక్షితంగా బయటపడ్డారు. స్థానికులు, పోలీసులు ఘటనస్థలికి చేరుకుని సహాయచర్యలు చేపట్టారు.

## మహిళ హత్యకేసులో నిందితులు అరెస్టు

**మచిలీపట్నం** కృష్ణా జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మీడియాతో మాట్లాడారు. గన్నవరం దావాజీ గూడెం జి ఆర్ కె పారడైజ్ అపార్ట్మెంట్లో కాజా రజిత కుమారి (55)హత్య కేసులో నిందితులను మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఎస్పీ మాట్లాడుతూ ఒంటరిగా ఉన్న మహిళతో సన్నిహితంగా మెలిగి బంగారం డబ్బులు కోసం హత్య చేసిన నిందితుల నుండి 56 లక్షల విలువచేసే సొత్తు, నేరానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు. గన్నవరం దావజీగూడెం జి ఆర్ కె అపార్ట్మెంట్లో నివాసం ఉండే కాజ రజిత కుమారి( 55) హత్య కేసుల్లో నిందితులుగా పోలవరపు సుష్మ (43) పోలవరపు అజయ్ కుమార్(25) లను అదుపులో తీసుకున్నామని అన్నారు. అపార్ట్మెంట్లోని సీసీ కెమెరాలు ఆధారంగా నిందితులను గుర్తించి అరెస్ట్ చేయడం జరిగింది. కేసు దర్యాప్తు లో ప్రతిభ కనబరిచిన సిబ్బందిని అభినందించారు.

## 3000 కొత్త ఈవీ బస్సులతో

## ఆర్టీసీకి కొత్త రూపు

**- భోగాపురం ఎయిర్పోర్టు, విజయవాడ నుంచి 40 ప్రత్యేక బస్సులు**

**- మంత్రి మండిపల్లి**

**విజయవాడ** 3000 కొత్త ఈవీ బస్సులతో ఆర్టీసీకి కొత్త రూపు రానుందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. – ఆర్టీసీ అభివృద్ధిపై సీఎం అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం తరువాత మంత్రి మీడియాతో మాట్లాడారు. ఆర్టీసీ ఆధునీకరణకు కీలక నిర్ణయాలు తీసుకున్నాం. గత ఐదేళ్లలో దెబ్బతిన్న ఆర్టీసీని కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టింది. స్త్రీ శక్తి పథకం విజయవంతంగా ఏడాది పూర్తి చేసుకుంది. రాష్ట్రంలో దశలవారీగా ఈవీ బస్సుల విస్తరణకు కార్యాచరణ సిద్ధం. తొలి దశలో 700 ఈవీ బస్సులు రెండు నెలల్లో అందుబాటులోకి రానున్నాయని అన్నారు.జూలైలో 6 డిపోలలో ఈవీ బస్సుల నిర్వహణకు మౌలిక సదుపాయాలు సిద్ధం అవుతాయి.

మహావాస్ పథకం కింద 300 ఈవీ బస్సుల కేటాయింపు వుంటుంది. మరో 500 ఈవీ బస్సుల కొనుగోలు ప్రక్రియ పూర్తి అయింది. రాష్ట్రవ్యాప్తంగా 3,000 ఈవీ బస్సుల ఏర్పాటే ప్రభుత్వ లక్ష్యం. కాలుష్య నియంత్రణలో ఏపీని అగ్రస్థానంలో నిలపాలని సీఎం ఆదేశం. భోగాపురం ఎయిర్పోర్టు, విజయవాడ నుంచి 40 ప్రత్యేక బస్సులు నడుస్తాయి. గోదావరి పుష్కరాలకు "గోదావరి" అనే పేరుతో ప్రత్యేక బస్సు సర్వీసులు వుంటాయి. అన్ని ఘాట్ల వద్ద పుష్కరాల ఏర్పాట్లు సిద్ధం అయ్యాయి. కొత్త ఈవీ బస్సులు ఆధునిక సౌకర్యాలతో అందుబాటులోకి రానున్నాయి. రానున్న రోజుల్లో పల్లెవెలుగు నుంచి ఎక్స్ప్రెస్ వరకు అన్ని విభాగాల్లో ఈవీ బస్సుల వినియోగం వుంటుంది. స్త్రీ శక్తి పథకం ఆర్టీసీపై భారం కాదు బాధ్యత. ఆర్టీసీని ప్రైవేటీకరించే ఆలోచన ప్రభుత్వానికి లేదు. – ఏపీఎస్ఆర్టీసీకి ప్రజలకు మధ్య విడదీయరని అనుబంధం ఉంది.– పీపీపీ విధానంలో డిపోల ఆధునీకరణ చేపడతాం. ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుంది. రెండేళ్లలో నైట్ అలవెన్స్ సహా ఉద్యోగుల పలు సమస్యల పరిష్కారం చేశాం. 3000 కొత్త ఈవీ బస్సులతో ఆర్టీసీకి కొత్త రూపు రానుందని అన్నారు.

## అమీర్‌పేటలో ఎన్టీఆర్

## విగ్రహ ఏర్పాటు హర్షణీయం

**- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కాట్రగడ్డ ప్రసూన కృతజ్ఞతలు**

**హైదరాబాద్:**తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచవ్యాప్తం చేసిన మహానాయకుడు, స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహాన్ని అమీర్‌పేట కూడలిలో ప్రతిష్ఠించడం పట్ల సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే కాట్రగడ్డ ప్రసూన తీవ్ర హర్షం వ్యక్తం చేశారు. ఈ అద్భుతమైన నిర్ణయాన్ని తీసుకుని, విగ్రహ ఏర్పాటుకు సహకరించిన గౌరవ తెలంగాణ ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి కి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు మరియు అభినందనలు తెలియజేశారు.?ఈ సందర్భంగా కాట్రగడ్డ ప్రసూన మాట్లాడుతూ.. "తెలుగు ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్న అన్న నందమూరి తారకరామారావు గారి విగ్రహాన్ని అమీర్‌పేట లాంటి ఒక ప్రధాన కూడలిలో ఏర్పాటు చేయడం తెలుగుజాతికి గర్వకారణం. ఎన్టీఆర్ కేవలం ఒక పార్టీకో, ప్రాంతానికో పరిమితమైన నాయకుడు కాదు.. ఆయన యావత్ తెలుగుజాతి ఆస్తి. అలాంటి మహానుభావుడి సంస్మరణకు, వారి కీర్తిని సమున్నతంగా నిలపడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు చూపిన చొరవ, పెద్దమనసు నిజంగా అభినందనీయం" అని కొనియాడారు.రాజకీయాలకు అతీతంగా, తెలుగు సంస్కృతిని, నాయకత్వ పటిమను రేవంత్ రెడ్డి దృక్పథం ఈ నిర్ణయంతో మరోసారి రుజువైందని ఆమె పేర్కొన్నారు. ఈ విగ్రహ ఏర్పాటు అమీర్‌పేట పరిసర ప్రాంతాల ప్రజలకే కాకుండా, నగరాసికులకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ప్రసూన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## టీటీడీకి ఎలక్ట్రిక్ బస్సు విరాళం

**తిరుమల** చెన్నైకి చెందిన ప్రముఖ భక్తుడు విష్ణువర్ధన్ టీటీడీకి ఆధునిక ఎలక్ట్రిక్ బస్సును విరాళంగా సమర్పించారు. శ్రీవారి ఆలయం సమీపంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం బస్సు తాళాలను టీటీడీ అధికారులకు అందజేశారు ఈ బస్సును తిరుమలలో భక్తుల ఉచిత రవాణా సేవల కోసం వినియోగించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం తిరుమలలో ఇప్పటికే పలు ఎలక్ట్రిక్ "ధర్మరథం" బస్సులు నడుస్తుండగా, కొత్త బస్సు చేరికతో సేవలు మరింత విస్తరించనున్నాయి. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా టీటీడీ పూర్తిగా ఎలక్ట్రిక్ వాహనాల వైపు అడుగులు వేస్తోందని అధికారులు తెలిపారు. భక్తుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో ఉచిత బస్సు సౌకర్యాలు మరింత బలోపేతం చేయాలని టీటీడీ యోచిస్తోంది. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బివిఆర్ నాయుడుఅదనపు ఈవో వెంకయ్య చౌదరి అధికారులు పాల్గొన్నారు

## సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా

## త్రివేణి సంగమంలో పుణ్యస్నానం

**కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రీగణేష్**

**కాళేశ్వరం** సరస్వతి నది అంత్య పుష్కరాల సందర్భంగా పవిత్ర గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతీ నదుల త్రివేణి సంగమం వద్ద కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ శుక్రవారం పుణ్యస్నానం ఆచరించారు.

అనంతరం సంగమ క్షేత్రమైన శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారి ఆలయంలో దర్శనం చేసుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితుల ఆశీర్వచనం అందుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా, సస్యశ్యామలంగా ఉండాలని ఆ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి వారిని ప్రార్థించానని తెలిపారు.

## వైకుంఠం క్యూ కాంప్లెక్స్లో నిండిపోయిన కంపార్ట్మెంట్లు

**తిరుమల** వైకుంఠం క్యూ కాంప్లెక్స్లోని అనేక కంపార్ట్మెంట్లు పూర్తిగా నిండిపోయాయి. సర్వదర్శనం భక్తులకు సుమారు 21 నుంచి 28 గంటల వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. తిరుమల ఘాట్ రోడ్లపై వాహనాల రద్దీ పెరగడంతో ట్రాఫిక్ నెమ్మదిగా కదులుతోంది. శ్రీవారి ఉచిత దర్శనం కోసం వచ్చిన భక్తులతో క్యూ లైన్లు కిలోమీటర్ల మేర విస్తరించాయి ప్రత్యేక ప్రవేశ దర్శనం (300) టికెట్లు ఉన్న భక్తులకు కూడా 2 నుంచి 4 గంటల వరకు నిరీక్షణ ఉండొచ్చని సమాచారం. టీటీడీ అధికారులు అదనపు భద్రతా సిబ్బంది, తాగునీరు, అన్నప్రసాదం, వైద్య సేవలు ఏర్పాటు చేశారు.

# పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం:రెడ్డి అప్పలనాయుడు

- ప్రొఫెసర్ నాగేశ్వరరావు పై కేసు వద్దని పవన్ చెప్పారు
- సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో క్షమాపణ చెప్పించాలని డిమాండ్
- తెలంగాణ కాంగ్రెస్ ఎమ్మెల్యేల వ్యాఖ్యలపై మీడియా సమావేశంలో రెడ్డి అప్పలనాయుడు ఫైర్




ఏలూరు(ప్రశ్న న్యూస్) పబ్లిసిటీ కోసమే తెలంగాణ ఎమ్మెల్యేలు మా అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పై విమర్శలు చేస్తున్నారని ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్, ఏలూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జీ రెడ్డి అప్పలనాయుడు ధ్వజమెత్తారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ పై హైదరాబాద్ కేంద్రంగా కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, విశ్లేషకులు చేసిన వ్యాఖ్యలను ఏలూరు జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా శనివారం ఏలూరు జనసేన పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఎలాంటి ఆపద వచ్చినా, కోట్లాది రూపాయలు విరాళాలు అందిస్తూ, వారి సంక్షేమం కోసం నిరంతరం కృషిచేస్తున్న నాయకుడు పవన్ కళ్యాణ్ అన్నారు. అలాంటి వ్యక్తిపై కొంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, విశ్లేషకులు ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడటం బాధాకరమని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ ఎప్పుడు తెలంగాణ ప్రజలను, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని గౌరవిస్తారని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు కూడా నేర్చుకోవాల్సిన అంశాలు ఉన్నాయని అనేక సందర్భాల్లోను గుర్తు చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రభుత్వ విధానాలు రాజకీయ అంశాలపై విమర్శలు సహజమేనని, అయితే వ్యక్తిగత దూషణలు చేయడం, ప్రాంతీయ భావోద్వేగాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడం, ఏమాత్రం సమంజసం కాదని స్పష్టం చేశారు. తెలంగాణ ఆంధ్రప్రదేశ్ ప్రజలు అన్నదమ్ముల పరస్పర గౌరవం, సోదర భావంతో కలిసి ముందుకు సాగాలని, రెండు తెలుగు రాష్ట్రాల ఐక్యతకు ప్రతీకగా నిలవాలని, ఆయన ఆకాంక్షించారు. ప్రాంతీయ విభేదాలు సృష్టించే ప్రయత్నాలను ప్రతి ఒక్కరు ఖండించాలని, సామాజిక సామరస్యాన్ని కాపాడేందుకు, అందరూ బాధ్యతయుతంగా వ్యవహరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఆంధ్ర,తెలంగాణ ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడం సరికాదని తెలిపారు. జనసేనకు తెలంగాణలో క్రేజ్ పెరుగుతుందన్న భయంతోనే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇలా మాట్లాడుతున్నారని ఆయన విమర్శించారు. ప్రొఫెసర్ నాగేశ్వరరావు పై కూడా కేసులు వద్దని పవన్ కళ్యాణ్ చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి జోక్యం చేసుకొని కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో క్షమాపణ చెప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో భావప్రకటన, స్వేచ్ఛ ప్రతి ఒక్కరికి ఉన్నప్పటికీ, వ్యక్తిగత దూషణలు అవమానకర వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. జరిగిన విషయాలకు, వాస్తవాలకు మించి ఊహాగానాలు జోడించి, ప్రచారం చేయడం బాధ్యత రాహిత్యమని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతతో వ్యవహరించాల్సిన వ్యక్తులు, అనవసర వ్యాఖ్యలతో సమాజంలో విభేదాలు సృష్టించకూడదని రెడ్డి అప్పలనాయుడు అప్పల నాయుడు మండిపడ్డారు. భవిష్యత్తులో తెలంగాణలో జనసేన పార్టీకి మరింత బలం పెరిగి, ప్రజల్లో విశ్వాసం సాధిస్తుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాదులో పవన్ కళ్యాణ్ ని అడుగుపెట్టనీయమంటు మాట్లాడుతున్న వారిని ఉద్దేశించి, జనసేన పార్టీ తెలంగాణ గడ్డపై ఆవిర్భవించిందని పవన్ కళ్యాణ్ ని అడ్డుకునే శక్తి ఎవరికీ లేదని స్పష్టం చేశారు. సమాజంలో ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టే ప్రయత్నాలు మానుకొని, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. మీడియా సమావేశంలో రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ కావూరి వాణిశ్రీ, రాష్ట్ర చేనేత కార్యదర్శి దోనేపూడి లోవరాజు, మాజీ డిప్యూటీ మేయర్ శిరిపల్లి శివరామకృష్ణ ప్రసాద్, జిల్లా కార్యదర్శి కస్తూరి సాయి తేజస్విని, నగర అధ్యక్షులు వీరంకి పండు, అధ్యక్షులు నగిరెడ్డి కాశీ నరేష్, నాయకులు రెడ్డి గౌరీ శంకర్, బోండా రాము నాయుడు, ఎట్రించి ధర్మేంద్ర, బొత్స మధు, సోషల్ సర్వీస్ మురళి, నూకల సాయి, కొండల ప్రసాద్, జనసేన రవి, పెరుమాళ్ళ జనార్ధన్ రావు, 1టౌన్ మహిళ కార్యదర్శి వెలగా గాయత్రీ తదితరులు పాల్గొన్నారు..

## సింహవాహనంపై సుదర్శన నరసింహుడిగా అభయమిచ్చిన కల్యాణ వేంకటేశ్వరుడు

### దుష్టశిక్షణ--శిష్టరక్షణ ధర్మాన్ని చాటిన దివ్య విహారం



నారాయణవనం(ప్రశ్న న్యూస్) శ్రీ పద్మావతి సమేత శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడో రోజైన శనివారం ఉదయం సింహవాహనంపై సుదర్శన నరసింహుడి అలంకారంలో శ్రీనివాసుడు భక్తులకు దివ్య దర్శనమిచ్చారు.అనంత తేజోమూర్తిగా వెలసిన స్వామివారు సింహవాహనాన్ని అధిరోహించి దుష్టశిక్షణ, శిష్టరక్షణ ధర్మాన్ని చాటిచెప్పారు. పరాక్రమం, ధైర్యం, తేజస్సు, ఆధిపత్యానికి ప్రతీకైన సింహరూప దర్శనంతో భక్తులు ఆధ్యాత్మిక పారవశ్యంలో మునిగిపోయారు.వాహనం ముందు భక్త బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో గోవింద నామస్మరణ చేస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ వాహనసేవ అత్యంత వైభవంగా సాగింది. అడుగడుగునా భక్తులు కర్పూర హారతులు సమర్పించి స్వామివారి కటాక్షాన్ని పొందారు. సింహవాహనోత్సవం ద్వారా అజ్ఞానాన్ని తొలగించి ధర్మమార్గంలో నడవాలని, విజయస్ఫూర్తితో జీవించాలని శ్రీవారు సందేశమిచ్చారు.ఈ రాత్రి 7 గంటలకు ముత్యపుపందిరి వాహనంపై స్వామివారు భక్తులకు దర్శనమివ్వనున్నారు.వాహనసేవలో ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, సూపరింటెండెంట్ శ్రీనివాసులు రెడ్డి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు, ఇతర అధికారులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## మహిళలకు రాజకీయాలు అవసరమా అనే వైసీపీ గొడ్డలి పార్టీ వాళ్లకి బుద్ధి చెప్పే రోజులు వచ్చాయి: ఎంపీ బైరెడ్డి శబరి

### భవిష్యత్ తరాలకు గుర్తుండేలా మహిళలకు నారా లోకేష్ 33శాతం రిజర్వేషన్ ప్రకటన.



నంద్యాల (ప్రశ్న న్యూస్) తెలుగుదేశం పార్టీ మహానాడు ఇటీవల గొప్ప కనులపండువగా జరుపుకున్నామని, చరిత్రలోనే భవిష్యత్ తరాలు గుర్తుంచుకునేలా, ఎన్ టీ ఆర్ స్ఫూర్తితో రాష్ట్ర మంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు నారా లోకేష్ 2026 మహానాడు వేదిక ద్వారా మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని ప్రకటించడం గొప్పదని, ఇది మరువలేని సంఘటనగా ఉందని నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ బైరెడ్డి శబరి శనివారం శ్రీశైలంలోని శివాజీ స్ఫూర్తి కేంద్రంలో ఉచిత నేత్ర మెగా వైద్య శిబిరంను ప్రారంభించి మీడియా సమావేశంలో అన్నారు.ఎప్పుడు మహానాడు జరిగిన 5 లక్షల మంది కార్యకర్తలు పాల్గొనేవారని, ఈ మహానాడును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పర్యవేక్షణలో డిజిటల్, హైబ్రిడ్ పద్ధతిలో క్లస్టర్లుగా ఏర్పాటు చేసి నిర్వహించగా 17 లక్షల మంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు నమోదు చేసుకొని హాజరై ప్రపంచ రికార్డ్ సృష్టించారని. దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు స్ఫూర్తితో, సీఎం చంద్రబాబు ఆశయాలకు అనుగుణంగా మంత్రి నారా లోకేష్ మహిళలకు ఈ మహానాడు వేదిక ద్వారా 33 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తాం అని ప్రకటించడం మహిళా లోకం తరతరాలుగా గుర్తుండే సంఘటన అని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు. తాత ఎన్ టీ ఆర్, తండ్రి చంద్రబాబు ఆదర్శ బాటలో మంత్రి నారా లోకేష్ మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ప్రకటన చేసి మహిళా పక్షపతిగా నిలిచారని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

## మురుగు నీరును శుద్ధి చేసి ధవలేశ్వరం బ్యారేజీ దిగువ లంకల్లో వదిలేలా ఒక డెడికేటెడ్ ఛానల్ నిర్మాణం అవసరమన్న :ఎమ్మెల్యే గోరంట్ల




రాజమండ్రి(ప్రశ్న న్యూస్) కాలుష్యంపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటించి రివ్యూ తర్వాత ఓ కదలిక వచ్చిందని సీనియర్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి అన్నారు. ఏపీ పేపర్ మిల్లు కాలుష్యం, రాజమండ్రి నగర, రూరల్ కాలుష్యం, పారిశ్రామిక కాలుష్యం ప్రమాదకరంగా తయారైందని గోరంట్ల చెప్పారు. రాజమండ్రి మురుగు నీరును శుద్ధిచేసి గోదావరిలో ధవళేశ్వరం బ్యారేజ్ దిగున లంకల్లో వదిలేలా ఒక డెడికేటెడ్ ఛానల్ నిర్మాణం అవసరమని అన్నారు. ఇందుకోసం 440 కోట్ల రూపాయలతో ప్రతిపాదన సిద్ధం చేస్తామని పేర్కొన్నారు. కొన్ని ఎస్టిపి ప్లాంట్లు నిర్మాణం చేయాల్సి ఉందని మురుగునీరును శు ద్ధి చేసి మ్యారేజి దిగువ వదిలితేనే కాలుష్యం నుంచి మోక్షం ఉంటుందని ఆయన అన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ పర్యటించిన తర్వాత కాలుష్యం నియంత్రణకై ఒక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశారన్నారు.గోదావరి లో రాజమండ్రి మురుగునీరును కలవకుండా చూస్తేనే జలజీవన్ మిషన్లో రక్షిత మంచినీటిని ప్రజలకు అందించవచ్చునన్నారు. జలజీవన్ మిషన్ లో చేపట్టే పథకానికి ఇచ్చిన ఇరిగేషన్ స్థలంపై కొందరు సొసైటీ పేరుతో కోర్టుకెళ్లారని దానివల్ల ఇబ్బందులు ఎదురవుతాయని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చియ్య చౌదరి అన్నారు.

**కడియం పేపర్ మిల్ లాకౌట్ ఎత్తివేత పై**

తూర్పుగోదావరి జిల్లా కడియం బ్రాంచ్ ఏపీ పేపర్ మిల్లులో కొనసాగుతున్న లాకౌట్ ను కొంతమందిని తొలగించి ఎత్తివేస్తున్నట్టు యాజమాన్యం ప్రకటించడంపై మంత్రి కందుల దుర్గేష్, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి సీరియస్ అయ్యారు. గత నెల 27వ తేదీ నుంచి కడియం ఏపీ పేపర్ మిల్లులో కార్మికుల సమ్మెతో యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. అయితే కార్మిక సంఘాలకు యాజమాన్యానికి అనేక చర్చలు జరిగినప్పటికీ సమస్యలు పరిష్కారానికి యాజమాన్యం ముందుకు రాలేదు . అయినప్పటికీ తాజాగా 59 కాంట్రాక్ట్ కార్మికులను, వారికి మద్దతు తెలిపినందుకు 11 మంది రెగ్యులర్ కార్మికులను తొలగిస్తూ లాకౌట్ ను ఎత్తివేస్తున్నట్టు యాజమాన్యం ప్రకటించింది. దీనిపై స్పందించిన మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి యాజమాన్యం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తొలగించిన వారిని కూడా విధుల్లోకి తీసుకుని లాకౌట్ని ఎత్తివేస్తేనే అంగీకరిస్తామని, లేదంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని ఎమ్మెల్యే గోరంట్ల అన్నారు. పేపర్ మిల్లు యాజమాన్యం కార్మికులకు సంబంధించిన వేతనాలు పెంచకపోవటం వారి సమస్యలు పరిష్కరించకపోవడం దారుణమని, యాజమాన్యం వైఖరిని తీవ్రంగా ఖండించారు

## ఎన్టీఆర్ స్టేడియాన్ని అధునాతన ప్రమాణాలతో అభివృద్ధి చేయుటకు ప్రణాళికలు సిద్ధం చెయ్యండి: నగర కమిషనర్



గుంటూరు (ప్రశ్న న్యూస్) ఎన్.టి.ఆర్ స్టేడియాన్ని అధునాతన ప్రమాణాలతో, ఆహ్లాదకరంగా ఉండేలా గ్రీనరి అభివృద్ధి చేయుటకు ప్రణాళికలు సిద్ధం చేయాలని నగర కమిషనర్ కే. మయూర్ అశోక్ తెలిపారు. శనివారం నగర పాలక సంస్థలోని కమిషనర్ ఛాంబర్ నందు ఎన్.టి.ఆర్ స్టేడియం పాలకవర్గం ఆకాష్ ఆర్కిటెక్ ప్రతినిధులతో, జియంసి అధికారులతో ఎన్.టి.ఆర్ స్టేడియం అభివృద్ధి పై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశం నందు తొలుత స్టేడియంలో మహిళకు, పురుషులకు వేరుగా వేరుగా జిమ్ లను అభివృద్ధి చేయడానికి ఆకాష్ ఆర్కిటెక్ సంస్థ ప్రతినిధులు తయారు చేసిన ప్రతిపాదనలు డిజైన్స్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, గుంటూరు నగరంలో ఎన్.టి.ఆర్ స్టేడియానికి ఎంతో ప్రాధాన్యత ఉందని, అటువంటి స్టేడియాన్ని ప్రజల సౌకర్యార్థం అంతర్జాతీయ ప్రమాణాలతో, ఆహ్లాదకరంగా ఉండేలా అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దానికి కోసం ప్రత్యేకంగా కన్సల్టెంట్ల ద్వారా ప్రతిపాదనలు తయారు చేయిస్తున్నామన్నారు. సదరు కన్సల్టెంట్లు స్టేడియంలోని జిమ్ లను స్త్రీ, పురుషులకు ప్రత్యేకంగా అత్యాధునిక పరికరాలతో అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేశారని తెలిపారు.

సదరు జిమ్ లలో ఆధునిక వెయిట్ లిఫ్టింగ్ పరికరాలు, ట్రేడ్ మిల్స్, స్టీం బాత్ ఇతర పరికరాలు ఏర్పాటు చేయుటకు ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు. అంతేకాక ఎన్.టి.ఆర్ స్టేడియంలోని వాకింగ్ ట్రాక్, టెన్నిస్, వాలీ బాలల్ కోర్ట్ లలో సమస్యలేమైనా ఉంటె వాటికీ కూడా పూర్తి స్తాయిలో మరమ్మతులు చేయిస్తామన్నారు. అదేవిధంగా వాకింగ్ చేయుటకు స్టేడియానికి వచ్చే ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం ఉండేలా గ్రీనరి అభివృద్ధి చేయాలని, దానికి అవసరమైన మొక్కలను నాటాలని అధికారులను ఆదేశించారు. అలాగే ఇంకా స్టేడియంలో అసరమైన మౌలిక సదుపాయాలను గుర్తించి వాటిని అభివృద్ధి చేయుటకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సదరు సమావేశం ఎన్.టి.ఆర్ స్టేడియం సెక్రటరీ వజ్జా రామాక్రిష్ణ, కమిటీ మెంబర్లు, ఆకాష్ ఆర్కిటెక్ సూరజ్ వారి ప్రతినిధులు, నగర పాలక సంస్థ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామస్థాయిలో ప్రతి ఒక్కరికి చట్టాలపై అవగాహన కల్పించాలి

### నాలుగవ అదనపు జిల్లా జడ్జి సుంకర శ్రీదేవి.



తణుకు(ప్రశ్న న్యూస్) తణుకు మండల న్యాయ సేవలు కమిటీ చైర్మన్, నాలుగవ అదనపు జిల్లా జడ్జి సుంకర శ్రీదేవి, శనివారం తణుకులో తణుకు బార్ అసోసియేషన్ న్యాయవాదులతో, శిక్షణ పొందుతున్న మీడియేటర్ లతో న్యాయ సేవ కార్యక్రమాలు లో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామ గ్రామాల్లో ప్రతి ఒక్కరికి చట్టాలు, ఉచిత న్యాయ సహాయం పై అవగాహన కల్పించాలన్నారు. పేదవారు, ధనికులు అనే బేధం లేకుండా అందరూ న్యాయ ఫలాలు పొందాలనేది జాతీయ న్యాయ సేవల సంస్థ ముఖ్య ఉద్దేశం అన్నారు. న్యాయం పొందటానికి అందరూ అర్హులే అనే విషయాన్ని తెలియ చెప్పాలన్నారు. న్యాయస్థానాలు పని చేయి ప్రతి చోట ఉచిత న్యాయ సేవలు అందిస్తున్నారని, ఈ విషయాన్ని అందరికీ తెలియజేయాలని చట్టాలపై కూడా అవగాహన కల్పించాలన్నారు అనంతరం జస్టిస్ సుంకర శ్రీదేవి తణుకు సబ్ జైల్ ను సందర్శించి అందులో వున్న రిమాండ్ ముద్దాయిలకు అందుచున్న ఆహార, వసతి, వైద్య సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు, వారి కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు, ఏమైనా సమస్యలు ఉంటే తెలియచేయాలని కోరారు, కేసుల పురోగతి సమాచారము కోసం ప్రతి బుధవారం, శనివారం జైలు విజిటింగ్ ప్యానెల్ న్యాయవాది, పారా లీగల్ వాలంటీర్ లు వస్తారని వారిద్వారా కేసు వివరాలు అడిగి తెలుసుకోవాలని, న్యాయవాదిని తమ తరపున వాదించుటకు ఏర్పాటు చేసుకోలేని వారికి మండల న్యాయ సేవల కమిటీ తణుకు వారి ద్వారా ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తారన్నారు.శిక్షపడి న ముద్దాయిలకు వారి కేసులలో అప్పీల్ చేయుటకు కూడా న్యాయవాదిని ఏర్పాటు చేస్తారని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి = ఆశీర్వాదం పాల్, బార్ అసోసియేషన్ న్యాయవాదులు కౌర్ వెంకటేశ్వర్లు, వా అలీఖాన్ బాజీ, కామన ముని స్వామి, అంగజాల అజయ్ కుమార్, కంబాల సత్యవతి ఇతర న్యాయవాదులు, సబ్ జైల్ సూపరింటెండెంట్ జి మోహన రావు, సిబ్బంది పాల్గొన్నారు.

## సమాజానికి దిశానిర్దేశం చేసే టార్చిలైట్‌లా వార్తలు ఉండాలి..!!




**బద్వేలు** మీడియా అందించే ప్రతి వార్త సమాజానికి వెలుగు చూపే టార్చిలైట్‌లా ఉండాలని, ప్రజలను ఆలోచింపజేస్తూ సామాజిక మార్పుకు వారధిగా నిలవాలని కడప జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జిల్లా గ్రామీణ విలేకరులకు సూచించారు.శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో రాష్ట్ర సీఆర్ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో వైఎస్సార్ కడప జిల్లా గ్రామీణ విలేకరులకు నిర్వహిస్తున్న రెండు రోజుల పునశ్చరణ శిక్షణా తరగతుల ప్రారంభ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి హాజరై ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేశ్ కుమార్ అధ్యక్షత వహించగా, శిక్షకులుగా సీనియర్ పాత్రికేయులు, రచయిత ఉమామహేశ్వరరావు, ఎపియుడబ్ల్యుజె జర్నలిస్టు యూనియన్ రాష్ట్ర నాయకులు రామసుబ్బారెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ ఎడి పద్మజ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వేగంగా మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా మీడియా ప్రతినిధులు తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ నాల్గవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదగడం, త్వరలోనే మూడో స్థానానికి చేరుకునే దిశగా పయనించడం దేశ ప్రజలందరికీ గర్వకారణమన్నారు. దేశ అభివృద్ధిలో మీడియా పాత్ర అత్యంత కీలకమైన పాత్ర పోషించే స్థాయిలోకి ఎదగాలని సూచించారు.ప్రస్తుతం మీడియా ద్వారా అందుతున్న సమాచారం సమాజానికి, ప్రభుత్వ పరిపాలనకు పరిమిత స్థాయిలో మాత్రమే ఉపయోగపడుతోందని, భవిష్యత్తులో వార్తలు ప్రజల జీవితాలను ప్రభావితం చేసే విధంగా, కనీసం 70 శాతం మేర ఉపయోగకరంగా ఉండేలా విలేకరులు తమ ఆలోచనా విధానాన్ని, విశ్లేషణాత్మక దృష్టిని విస్తరించుకోవాలని సూచించారు."వార్త అనేది కేవలం సంఘటన వివరణ మాత్రమే కాదు; అది సమాజానికి దిశానిర్దేశం చేసే శక్తి. ప్రజల్లో చైతన్యం పెంచుతూ, సమస్యలపై చర్చకు దారి తీస్తూ, పరిష్కార మార్గాలను సూచించగలగాలి" అని ఆయన సూచించారు.ఇరవై ఏళ్ల క్రితం సమాజంలో, పరిపాలనలో కనిపించిన ప్రశ్నించే తత్వం ప్రజాస్వామ్యానికి బలమని, ఆ విలువలను తిరిగి బలోపేతం చేసే దిశగా మీడియా కృషి చేయాలని కోరారు. ప్రజా సమస్యలను లోతుగా అధ్యయనం చేసి, నిర్మాణాత్మక చర్చకు దోహదపడే కథనాలను అందించాల్సిన బాధ్యత మీడియాపై ఉందన్నారు.


## హ్యూమన్ రైట్స్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా

# నంగునూరి సత్యనారాయణ



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట జిల్లా గజ్వేల్ కు చెందిన ఆర్యవైశ్య సీనియర్ నాయకులు, కొమరవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియామకమయ్యారు, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా జాతీయ అధ్యక్షులు కటకం శ్రీనివాస్ చేతుల మీదుగా ( ఐ హెచ్ ఆర్ సి) ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియామక పత్రం అందుకున్నారు, ఈ సందర్భంగా కటకం శ్రీనివాస్ మాట్లాడుతూ నంగునూరు సత్యనారాయణ రాజకీయ రంగంలో రాణిస్తూ సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేస్తూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించినందుకు, వారికి ఐ.హెచ్.ఆర్.సి.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు పదవి ఇవ్వడం జరిగిందని అన్నారు, అనంతరం నంగునూరు సత్యనారాయణ మాట్లాడుతూ, ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పదవి రావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతూ, మానవ హక్కుల కోసం ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిటీ ఆఫ్ ఇండియా ద్వారా ప్రతి ఒక్కరికి అండగా ఉంటామని తెలిపారు

## ఐఐఐటి బాసరలో సీట్లు సాధించిన గజ్వేల్ జడ్పీ బాలికల పాఠశాల విద్యార్థినులు





గజ్వేల్ (ప్రశ్న న్యూస్) గజ్వేల్ పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల ( జెడ్ పి జి హెచ్ ఎస్ ) విద్యార్థినులు ఐఐఐటి బాసరలో ప్రవేశానికి ఎంపికై పాఠశాలకు గర్వకారణమయ్యారు. విద్యార్థినులు బందేల సహస్ర, చల్ల సంజనా, మెతుకు దుర్గ తమ ప్రతిభ, కృషి, పట్టుదలతో ఐఐఐటి బాసరలో సీట్లు సాధించి విశేష ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షాహీన్ సుల్తానా, ఎఎపి చైర్పర్సన్ సౌందర్య, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు విద్యార్థినులను అభినందిస్తూ వారి భవిష్యత్తు మరింత ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా లక్ష్యసాధన కోసం కష్టపడి చదివితే ఉన్నత విద్యావకాశాలను అందిపుచ్చుకోవచ్చని ఈ విజయం మరోసారి నిరూపించిందని ప్రధానోపాధ్యాయురాలు పేర్కొన్నారు. విద్యార్థినుల విజయంతో పాఠశాల ప్రాంగణంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, విద్యార్థులు వారికి శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీధర్ బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బోయిని ఎల్లేష్ యాదవ్



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు,శాసనసభా వ్యవహారాల శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు జన్మదిన వేడుకల సందర్భంగా బోయినిపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్ హార్దిక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి శ్రీధర్ బాబు నిత్యం ప్రజాసేవలో నిమగ్నమై రాష్ట్ర అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. ప్రజల సంక్షేమం, రాష్ట్ర ప్రగతికి మరింత సేవ చేసేలా భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## సేవే లక్ష్యంగా ముందుకు సాగుతున్న

# రిటైర్డ్ ఆర్మీ జవాన్ కొమ్ము కోటి

### స్వంత ఖర్చులతో బస్ షెల్టర్ నిర్మాణం

### జాతరలో చలివేంద్రం ఏర్పాటు..

### కరోనా సమయంలో విశేష సేవలు



నకిరేకల్ (ప్రశ్న న్యూస్) దేశ రక్షణ కోసం దాదాపు 20 సంవత్సరాల పాటు భారత సైన్యంలో సేవలందించిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ కొమ్ము కోటి, పదవీ విరమణ అనంతరం కూడా సమాజ సేవలో చురుకుగా పాల్గొంటూ ప్రజల ప్రశంసలు అందుకుంటున్నారు.2017లో ఆర్మీ ఉద్యోగం నుంచి రిటైర్ అయిన అనంతరం తన స్వగ్రామమైన గంగాదేవిగూడెంలో ప్రజల సౌకర్యార్థం సుమారు లక్ష రూపాయల స్వంత నిధులతో తన తాత పేరుమీద బస్ షెల్టర్ నిర్మించి గ్రామస్థుల మన్ననలు పొందారు.ఇటీవల ఐటిపాముల, గంగాదేవిగూడెంలో నిర్వహించిన గంగ భవాని జాతర సందర్భంగా కొమ్ము కోటి ఆధ్వర్యంలోని జల్ తరుపున" చలివేంద్రం ఏర్పాటు చేసి, ఎండ తీవ్రత మధ్య జాతరకు వచ్చిన భక్తులకు చల్లని తాగునీరు అందించి దాహార్తిని తీర్చారు.కరోనా మహమ్మారి సమయంలో కూడా కొమ్ము కోటి విశేష సేవలు అందించారు. తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రెండు నెలల పాటు నకిరేకల్‌లో స్థానిక పోలీసులతో కలిసి వాలంటీర్‌గా విధులు నిర్వహించారు. అదే సమయంలో కరోనా బారిన పడిన తన మిత్రుడి ప్రాణాలను కాపాడేందుకు అప్పటి సీపీ సజ్జనార్ సమక్షంలో ప్లాస్మా దానం చేశారు.కరోనా కారణంగా మరణించిన వారి అంత్యక్రియల్లో కూడా పాల్గొని, మృతదేహాలను మోసేందుకు వెనుకాడకుండా మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. అనంతరం తాను కూడా కరోనా బారిన పడినప్పటికీ, తన శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసంతో వైరస్‌ను జయించి తిరిగి సేవా కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు.

సామాజిక సేవనే ధ్యేయంగా ముందుకు సాగుతున్న కొమ్ము కోటి, భవిష్యత్తులో రాజకీయాల్లోకి ప్రవేశించి ప్రజలకు మరింత ప్రత్యక్షంగా సేవ చేయాలనే ఆకాంక్షను వ్యక్తం చేస్తున్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే తన లక్ష్యమని, సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా కొనసాగిస్తానని ఆయన పేర్కొన్నారు.స్థానికులు మాత్రం కొమ్ము కోటి చేస్తున్న సేవా కార్యక్రమాలు యువతకు ఆదర్శంగా నిలుస్తున్నాయని అభిప్రాయపడుతున్నారు.

# అసలైన తెల్ల గలిజేరు – శ్వేత పునర్నవ

- ప్రపంచ గందరగోళానికి శాస్త్రీయ సమాధానం
- ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం
- శాస్త్రీయ పరిశోధనా విభాగం, ఔషధ మొక్కల గుర్తింపు, ప్రమాణీకరణ








ఆయుర్వేద వైద్య శాస్త్రంలో దశాబ్దాలుగా ఒక పెద్ద గందరగోళం నెలకొని ఉంది. అది అసలైన తెల్ల గలిజేరు అంటే ఏది అనే ప్రశ్న. ఈ సమస్యను లోతుగా పరిశోధించి శాస్త్రీయ ఆధారాలతో నిరూపించిన ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం యొక్క అనుపమ కృషిని ఈ వ్యాసం గుర్తిస్తోంది. ఈ సంఘం చేసిన పరిశోధన ఆయుర్వేద ప్రపంచంలో ఒక కొత్త వెలుగును నింపుతోంది.గందరగోళానికి కారణాలు – మూడు మొక్కలు, ఒకే పేరు నేటి మార్కెట్లో, పొలాలలో తెల్ల గలిజేరు పేరుతో ప్రధానంగా మూడు వేర్వేరు మొక్కలు అమ్ముడవుతున్నాయి. ఈ మూడింటిలో కేవలం ఒక్కటే నిజమైన ఔషధ మొక్క. మొదటిది అసలైన తెల్ల గలిజేరు అంటే శ్వేత పునర్నవ. దీని శాస్త్రీయ నామం బొయెర్హావియా డిఫ్యూసా లిన్ – తెల్ల పూల రకం. ఇది మాత్రమే నిజమైన ఔషధ మొక్క.రెండవది నిటారు గలిజేరు. దీని శాస్త్రీయ నామం బొయెర్హావియా ఎరెక్టా లిన్. ఇందులో పరిమిత ఔషధ గుణాలు మాత్రమే ఉంటాయి.మూడవది ఎర్ర గలిజేరు అంటే అటక మామిడి. దీని శాస్త్రీయ నామం ట్రయాంథెమా పోర్టులాకాస్ట్రమ్ లిన్. ఇది పూర్తిగా నకిలీ మొక్క. ఇందులో విషపూరిత గుణాలు కూడా ఉంటాయి.అసలైన తెల్ల గలిజేరును గుర్తించే విధానం ఈ క్రింది భౌతిక లక్షణాలను పరిశీలించడం ద్వారా అసలైన శ్వేత పునర్నవను ఖచ్చితంగా గుర్తించవచ్చు.కాండం రంగు పూర్తిగా లేత ఆకుపచ్చ లేదా తెల్లటి రంగులో ఉంటుంది. ఎక్కడా ఎరుపు లేదా గులాబీ ఛాయ ఉండదు. కాండం నేలపై పాకే స్వభావం కలిగి తీగ లాంటి నిర్మాణంతో ఉంటుంది. ఆకులు ఒక మోస్తరు గుండ్రంగా ఉండి అంచులు తరంగాల లాగా వంపు తిరిగి ఉంటాయి. ఒకే కణుపు వద్ద రెండు ఆకులు ఒకదానికొకటి ఎదురెదురుగా అమరి ఉంటాయి.అన్నింటికంటే ముఖ్యమైన లక్షణం పూల అమరిక. చిన్న చిన్న తెల్లటి పూలు గొడుగు ఆకారపు గుత్తులుగా పొడవాటి కాడ చివరన పూస్తాయి. ఇదే అసలైన శ్వేత పునర్నవకు అతి ముఖ్యమైన గుర్తింపు లక్షణం. వేరు లావుగా ముల్లంగి లాంటి ఆకృతి కలిగి మంచి సువాసన వెదజల్లుతుంది. ఆకులు పల్చగా సున్నితంగా ఉంటాయి.నకిలీ మొక్కతో స్పష్టమైన తేడాలుఅసలైన శ్వేత పునర్నవ కాండం మృదువుగా నేలపై పాకుతుంది. ఎర్ర గలిజేరు అటక మామిడి కాండం గట్టిగా గరుకుగా ఉంటుంది.అసలైన మొక్క ఆకులు పల్చగా సున్నితంగా ఉంటాయి. ఎర్ర గలిజేరు అటక మామిడి ఆకులు మందంగా నీళ్ళు నిండినట్లు ఉబ్బి ఉంటాయి.అసలైన మొక్కకు చిన్న తెల్లటి పూలు గుత్తులుగా కాడ చివరన పూస్తాయి. ఎర్ర గలిజేరు అటక మామిడికి ఒంటరి పువ్వు ఆకు కణుపు మధ్య కాడ లేకుండా అంటుకుని ఉంటుంది.అసలైన మొక్క వేర్లలో పునర్నవిన్ అనే ఆల్కలాయిడ్ అత్యధిక మోతాదులో ఉంటుంది. ఎర్ర గలిజేరు అటక మామిడిలో పునర్నవిన్ అసలు ఉండదు.అసలైన మొక్క మూత్రపిండాలు కాలేయం మరియు గుండెకు అమృతం లాంటిది. ఎర్ర గలిజేరు అటక మామిడి కేవలం విరేచన కారిగా మాత్రమే పనిచేస్తుంది.ఆయుర్వేద ఔషధ గుణాలుఆయుర్వేద గ్రంథాలైన భావప్రకాశం మరియు చరక సంహితలో శ్వేత పునర్నవను మహాశోథహర అని కొనియాడారు. అంటే శరీరంలో ఎలాంటి వాపులనైనా మూత్రపిండ జబ్బులనైనా నయం చేయగల అత్యుత్తమ మూలిక అని అర్థం. ఈ మొక్క వేర్లలో పునర్నవిన్ అనే ఆల్కలాయిడ్ మూత్రపిండాల పునరుజ్జీవనానికి అత్యంత ఉపయోగపడుతుంది. మూత్రపిండాల వ్యాధుల నివారణకు కాలేయ రక్షణకు శరీర వాపుల తగ్గింపుకు, గుండె రక్షణకు ఇది అమోఘంగా పనిచేస్తుంది. వాత పిత్త కఫ అనే మూడు దోషాలనూ సమతుల్యం చేసే శక్తి ఈ మొక్కలో ఉంది.నకిలీ మొక్కలు వాడటం వల్ల జరిగే నష్టాలుమార్కెట్లో లభించే నకిలీ మొక్కలను అసలైన తెల్ల గలిజేరు అనుకుని వాడటం వల్ల మూత్రపిండ సమస్యలు తగ్గకపోగా రోగం మరింత ముదురుతుంది. అమూల్యమైన సమయం వృధా అవుతుంది. కొన్ని నకిలీ మొక్కలలో విషపూరిత గుణాలు ఉండవచ్చు దాని వల్ల కాలేయంపై అదనపు భారం పడుతుంది. దీర్ఘకాలంలో ప్రాణాలకే ముప్పు కలిగే పరిస్థితులు వస్తాయి. అంతకంటే మించి ఆయుర్వేదానికి అపకీర్తి కలుగుతుంది. ఈ మహా శాస్త్రంపై సమాజంలో నమ్మకం సన్నగిల్లుతుంది.సమాజానికి సందేశం ఏ ఔషధ మొక్కనైనా వాడే ముందు తప్పకుండా ఔషధ మొక్కల నైపుణ్యం మరియు విజ్ఞానం కలిగిన అనుభవజ్ఞులైన ఆయుర్వేద వైద్యులను సంప్రదించండి. సరైన మొక్కలు సరైన మోతాదులో వాడినప్పుడే ఆయుర్వేదం నిజమైన ఫలితాలు ఇస్తుంది. అలా కాకుండా అజ్ఞానంతో నకిలీ మొక్కలు వాడడం వల్ల ఆయుర్వేదానికే చెడ్డపేరు వస్తుంది. ఇది మన అందరి బాధ్యత.ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండండి. ఔషధ మొక్కల విజ్ఞానం లేకుండా నైపుణ్యం కలిగిన వైద్యులను సంప్రదించకుండా ఏ మూలికనూ వాడకండి. ఆయుర్వేదం అనాదిగా మన జీవితాలను కాపాడిన మహా శాస్త్రం. దాన్ని కాపాడే బాధ్యత మనందరిది. శాస్త్రీయ నిరూపణ పద్ధతులు ఈ పరిశోధన సంఘం రూపశాస్త్ర పరీక్ష అంటే కాండం ఆకు పూల భౌతిక లక్షణాల పరిశీలన ద్వారా మొక్కను నిర్ధారించింది. పాతల పొర వర్ణలేఖన పరీక్ష ద్వారా వేర్లలో పునర్నవిన్ స్థాయులను నిర్ధారించింది. జీవ సంకేత పరీక్ష ద్వారా జాతిని ఖచ్చితంగా నిర్ధారించింది. పుష్పవిన్యాస అధ్యయనం ద్వారా పూల కాడల అమరిక ఆధారంగా ఎర్ర గలిజేరు అటక మామిడి నుండి తేడాను నిరూపించింది.

అసలైన తెల్ల గలిజేరును నిరూపించిన ఆయుర్వేద పరంపర మూలికా వైద్య మహా సంఘం

**వ్యవస్థాపక అధ్యక్షులు**
**శ్రీ సింహాచలం లక్ష్మణ స్వామి**
**ఫోన్: 091 99082 89830**


## రేవల్లపాలెం రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం 12ఏళ్ల నిరీక్షణకు తెర దించిన

**: ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు**



మధురవాడ (ప్రశ్న న్యూస్ ) జీవీఎంసీ ఆరో వార్డు పరిధి మధురవాడ నుంచి రేవల్లపాలెం వెళ్లే 80 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణ పనులకు ఎట్టకేలకు మోక్షం లభించింది గత 12 సంవత్సరాలుగా వివిధ కారణాల వల్ల నిలిచి పోయిన ఈరోడ్డు పనులను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం దగ్గరుండి మరీ ప్రారంభించారు. దీంతో రేవల్ల పాలెం గ్రామస్తుల దశాబ్ద కాలపు నిరీక్షణకు తెరపడి నట్లయింది.రేవల్లపాలెం గ్రామంలో రోడ్డు విస్తరణకు సంబంధించి మొత్తం 32 మంది లబ్ధిదారులకు జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం టీడీఆర్ లు అంద జేయాల్సి ఉంది అయితే జీవీఎంసీ టౌన్ ప్లానింగ్,సర్వే విభాగాల అలసత్వం కారణంగా ఆరు టీడీఆర్‌లు సుదీర్ఘకాలం పాటు పెండింగ్ లో ఉండిపోయాయి. ఆరు నెలల క్రితం వీటిలో మూడింటిని పరిష్కరించి నప్పటికీ మిగిలిన ముగ్గురు లబ్ధిదారులు నాగోతి ఎల్లా రావు,నాగోతి వెంకటరావు దేవర తాతబాబులకు టీడీఆర్‌లు అందలేదు దీంతో రోడ్డు పనులు పూర్తి గా నిలిచిపోయాయి. రోడ్డు పనులు అర్ధాంతరంగా ఆగి పోవడంతో రేవల్లపాలెం మీదుగా ప్రయాణించే వాహనదారులు,స్థానిక ప్రజలు గత కొన్నేళ్లుగా తీవ్ర నరకం అనుభవించారు అధ్వాన్నంగా మారిన రహ దారితో స్థానికుల కష్టాలు వర్ణనాతీతంగా మారాయి. తీవ్రమైన సమస్యపై భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు ప్రత్యేక శ్రద్ధ తీసు కున్నారు పెండింగ్‌లో ఉన్న మిగిలిన మూడు టీడీఆర్ సమస్యలను నెల రోజుల్లోగా పరిష్కరిస్తానని లబ్ధిదారు లకు హామీ ఇచ్చారు ఎమ్మెల్యే చొరవతో శనివారం రేవల్లపాలెం గ్రామంలో 80 అడుగుల మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులు పునఃప్రారంభ మయ్యాయి గ్రామస్తుల ఆనందోత్సాహాలు రోడ్డు పనులు ప్రారంభం కావడం తో స్థానిక ప్రజల్లో ఆనందం వెల్లివిరిసింది.ఈకార్యక్రమంలో రేవల్లపాలెం గ్రామానికి చెందిన నాగోతి వెంకట్రావు పోతిన శ్రీను, వాండ్రాసి వెంకటి, పిల్లా అప్పలరాజు, వాండ్రాసి శ్రీను పాల్గొన్నారు ఆరో వార్డు అధ్యక్షులు గరే. గురునాథ్(కెవిఆర్), నోడగల జానకిరామ్, వాండ్రాసి అప్పలనాయుడు, రెడ్డి సత్య నారాయణ, నమ్మి రమణ, నాగోతి వెంకట సత్య నారాయణ కానూరీ అచ్యుతరావు, నోడగల అప్పారావు,బోయి శ్రీనివాస్ రమాదేవి, సిహెచ్ సన్యాసి రావు తదితరులు పాల్గొన్నారు.

## టీటీడీకి ఎలక్ట్రిక్ బస్సు విరాళం



తిరుమల (ప్రశ్న న్యూస్ ) ఢిల్లీలోని నయాతి హెల్త్ కేర్ఁ రీసెర్చ్ ఆగ్రా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శనివారం ఉదయం టీటీడీకి రూ.1.13 కోట్లు విలువైన ఒలెక్ట్రా ఎలక్ట్రిక్ బస్సును విరాళంగా అందించారు.ఈ మేరకు ఆ సంస్థ అధినేత నీరా రాడియా శ్రీవారి ఆలయం ముందు బస్సుకు ప్రత్యేక పూజలు నిర్వహించి బస్సుకు సంబంధించిన పత్రాలు, తాళాలను టీటీడీ చైర్మన్ బీ.ఆర్.నాయుడు, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరికి అందజేశారు.ఈ సందర్భంగా చైర్మన్, అదనపు ఈవో దాతతో కలిసి బస్సులో ప్రయాణించి, ప్రయాణికులకు ఈ బస్సు చాలా సౌకర్యవంతంగా ఉందని దాతను అభినందించారు.కాగా ఈ బస్సును తిరుమలలోని భక్తుల సౌకర్యార్థం ఉచిత బస్సు గా వినియోగించనున్నారు.ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, టీటీడీ మాజీ బోర్డు సభ్యులు డి.పి.అనంత, తిరుమల ట్రాన్స్ పోర్ట్ డీఐ కృష్ణయ్య పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ గోవిందరాజస్వామి రథోత్సవం

### భక్తి పారవశ్యంలో రథాన్ని లాగిన వేలాది మంది భక్తులు

### ఆత్మతత్వాన్ని చాటిన దివ్య రథయాత్ర



తిరుపతి(ప్రశ్న న్యూస్) శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో ఎనిమిదో రోజైన శనివారం రథోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. గోవింద నామస్మరణలతో తిరువీధులు మార్మోగగా, వేలాది మంది భక్తులు భక్తి శ్రద్ధలతో రథాన్ని లాగి తమ భక్తిని చాటుకున్నారు.

ఉదయం 5.40 గంటలకు ప్రారంభమైన రథోత్సవం కర్ణాల వీధి, బేరి వీధి, గాంధీ రోడ్డు మీదుగా తిరిగి ఆలయ రథమండపానికి చేరుకుంది. మార్గమంతా భక్తులు టెంకాయలు కొట్టి, కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామివారికి మంగళారతులు అర్పించారు.రథోత్సవం వెనుక ఆధ్యాత్మిక సందేశంరథోత్సవం కేవలం ఉత్సవం మాత్రమే కాదు, ఆత్మజ్ఞానాన్ని బోధించే మహత్తర తాత్త్విక సందేశం కూడా. ఆత్మను రథికుడిగా, శరీరాన్ని రథంగా, బుద్ధిని సారథిగా, మనసును పగ్గంగా, ఇంద్రియాలను గుర్రాలుగా, విషయాలను వీధులుగా భావించడం ద్వారా ఆత్మ--అనాత్మ వివేకాన్ని ఈ ఉత్సవం భక్తులకు బోధిస్తుంది.వేడుకగా స్నపన తిరుమంజనంరథోత్సవం అనంతరం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారికి, నమ్మాళ్వార్ల ఉత్సవమూర్తులకు స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, చందనం, వివిధ పండ్లరసాలతో విశేష అభిషేకం చేశారు.నేడు అశ్వవాహనంపై గోవిందుడి దివ్య దర్శనంసాయంత్రం 5.30 నుండి 6 గంటల వరకు ఊంజల్‌సేవ జరగనుంది. రథోత్సవంలో శ్రీ శ్రీ శ్రీ పెద్ద జీయర్ స్వామి, శ్రీ శ్రీ శ్రీ చిన్న జీయర్ స్వామి, టీటీడీ బోర్డు సభ్యులు జి. భానుప్రకాశ్ రెడ్డి, ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో ఏబీ నారాయణ చౌదరి, ఆలయ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, పోలీసు అధికారులు, శ్రీవారి సేవకులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారుశ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మే 31, ఆదివారం ఉదయం 8 నుండి 9.30 గంటల వరకు కపిలతీర్థం (ఆళ్వార్ తీర్థం)లో చక్రస్నానం వైభవంగా నిర్వహించనున్నారు. ఇందుకోసం ఉదయం 6 గంటలకు స్వామివారు, అమ్మవార్లు తిరుచ్చిపై, చక్రతాళ్వార్ పల్లకీలో కపిలతీర్థానికి ఊరేగింపుగా బయలుదేరనున్నారు. చక్రస్నానం అనంతరం పీఆర్ తోటకు వేంచేపు చేసి, సాయంత్రం 6 గంటలకు తిరిగి ఆలయానికి చేరుకుంటారు.

## నాగలాపురంలో వైభవంగా కంచి గరుడసేవ



నాగలాపురం(ప్రశ్న న్యూస్) శ్రీ వేదనారాయణస్వామివారి ఆలయంలో శనివారం కంచి గరుడసేవ అత్యంత వైభవంగా నిర్వహించారు. కంచిపురంలోని శ్రీ వరదరాజస్వామివారి ఆలయంలో జరిగే ప్రసిద్ధ గరుడసేవను పురస్కరించుకుని, శ్రీ వేదనారాయణస్వామివారి ఆలయంలో ఈ గరుడసేవను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా సర్వాలంకార భూషితుడైన శ్రీ వేదనారాయణస్వామివారు ఉదయం గరుడవాహనంపై గ్రామవీధుల్లో విహరించి భక్తులకు దివ్య దర్శనమిచ్చారు. గరుడునిపై కొలువుదీరిన స్వామివారిని దర్శించుకున్న భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోయారు.వేదఘోషలు, మంగళవాయిద్యాల నడుమ సాగిన ఈ దివ్యోత్సవం ఆధ్యాత్మిక శోభను సంతరించుకోగా, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలను పొందారు.ఈ కార్యక్రమంలో టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, ఆలయ అర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## కూకునూర్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన సీపీ రష్మి పెరుమాళ్

**- శాంతిభద్రతలు, కేసుల పురోగతిపై సమీక్ష**

**- అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సిబ్బందికి సూచన**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్. రష్మి పెరుమాళ్, ఐపీఎస్ శనివారం కూకునూర్‌పల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితి, నమోదైన కేసుల పురోగతి, పోలీస్ స్టేషన్ నిర్వహణ తీరును ఆమె క్షుణ్ణంగా సమీక్షించారు.అనంతరం పోలీస్ సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించిన కమిషనర్, ప్రజల భద్రతే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం చోటుచేసుకోకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.ప్రజల్లో పోలీసులపై మరింత విశ్వాసం పెంపొందించేలా పారదర్శకత, జవాబుదారీతనంతో సేవలు అందించాలని సిబ్బందికి ఆదేశించారు. నేరాల నియంత్రణ, ప్రజలకు మెరుగైన పోలీసు సేవలందించడంలో నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ట్రైనీ ఐపీఎస్ అధికారి అయేషా ఫాతిమా, గజ్వేల్ ఏసీపీ నర్సింలు, సీఐ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతుల మోటార్లకు స్మార్ట్ మీటర్లు వద్దు

**జూన్ 4న 30 ట్రాక్టర్ల వడ్లతో రాజీవ్ రహదారి దిగ్బంధం**

**వంటేరు ప్రతాప్ రెడ్డి**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) గజ్వేల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ రైతు విధానాలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అందించగా, ప్రస్తుతం మూడు గంటల కరెంటు సరిపోతుందని కాంగ్రెస్ ప్రభుత్వం చెప్పడం రైతు వ్యతిరేక వైఖరికి నిదర్శనమని అన్నారు.రైతుల బోరు బావులకు స్మార్ట్ మీటర్లు అమర్చే ప్రయత్నాలను బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, రైతు డిస్కాం పేరుతో కొత్త వ్యవస్థలను తీసుకువచ్చి రైతులపై అదనపు భారం మోపే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. రైతుల వ్యవసాయ మోటార్లకు మీటర్లు పెట్టే నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు సక్రమంగా జరగడం లేదని ఆరోపిస్తూ, రాబోయే నాలుగు రోజుల్లో రైతుల వడ్లను కొనుగోలు చేయకపోతే జూన్ 4న 30 ట్రాక్టర్ల వడ్లతో రాజీవ్ రహదారిని దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. రైతుల సమస్యలను ప్రభుత్వం పట్టించుకోకపోతే ఉద్యమాన్ని మరింత ఉద్ధృతం చేస్తామని స్పష్టం చేశారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నాయని విమర్శించిన ఆయన, విద్యుత్ రంగంలో తీసుకొస్తున్న మార్పులు రైతాంగానికి నష్టదాయకమని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వం కేంద్ర ఒత్తిళ్లను ఎదుర్కొని వ్యవసాయ మోటార్లకు మీటర్లు అమర్చకుండా అడ్డుకుందని గుర్తుచేశారు.రైతు బీమా, రైతుబంధు, రుణమాఫీ, పంట బోనస్ వంటి అంశాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించిన వంటేరు ప్రతాప్ రెడ్డి, రైతుల పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని, 24 గంటల ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, కౌన్సిలర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## మాలలకు అన్యాయం జరుగుతోందని మాల సంఘాల జేఏసీ ఆరోపణ

**ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ విధానం, జనాభా లెక్కలపై**

**ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలకు పిలుపు**



గజ్వేల్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో గజ్వేల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాల సంఘాల నాయకులు ఎస్సీ వర్గీకరణ, రోస్టర్ విధానం, జనాభా లెక్కల విషయంలో మాల సామాజిక వర్గానికి అన్యాయం జరిగిందని ఆరోపించారు.

ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ మందాల భాస్కర్, వైస్ చైర్మన్ తుమ్మ శ్రీనివాస్, మాల స్టూడెంట్ జేఏసీ చైర్మన్ మాదాసు రాహుల్ రావు, గ్రేటర్ హైదరాబాద్ చైర్మన్ బత్తుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.నాయకులు మాట్లాడుతూ, 2011 జనాభా లెక్కల ప్రకారం మాలల జనాభా 18 లక్షలకు పైగా ఉండగా, సహజ జనాభా వృద్ధిని పరిగణనలోకి తీసుకుంటే ప్రస్తుతం సుమారు 25 లక్షలు ఉండాల్సి ఉందని, అయితే తాజా లెక్కల్లో కేవలం 14.69 లక్షలుగానే చూపించడం అనుమానాలకు తావిస్తోందన్నారు.ప్రస్తుత ప్రభుత్వం అమలు చేస్తున్న ఎస్సీ వర్గీకరణ చట్టం, రోస్టర్ విధానం వల్ల మాల సామాజిక వర్గానికి చెందిన విద్యార్థులు, నిరుద్యోగులు, ఉద్యోగులు నష్టపోతున్నారని ఆరోపించారు. ఉద్యోగ నోటిఫికేషన్లలో మాల వర్గానికి తగిన ప్రాతినిధ్యం కల్పించడం లేదని, విద్యా అవకాశాలు, ఉద్యోగాలు, ప్రమోషన్లలో వివక్ష కొనసాగుతోందని విమర్శించారు.మాలలకు జరుగుతున్న అన్యాయంపై ప్రతి జిల్లాలో సంఘాలు, విద్యార్థి నాయకులు కలిసి ప్రజాప్రతినిధులను కలిసి సమస్యలను వివరించాలని పిలుపునిచ్చారు. రిజర్వేషన్లు, రోస్టర్ విధానం, జనాభా లెక్కల్లో న్యాయం సాధించేందుకు రాష్ట్రవ్యాప్తంగా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు."పోరాడితే పోయేది ఏమీ లేదు, బానిస సంకెళ్లు తప్ప" అనే నినాదంతో ఉద్యమాలను మరింత ఉద్ధృతం చేస్తామని నాయకులు ప్రకటించారు.ఈ కార్యక్రమంలో మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుట్టి సత్యనారాయణ, ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షులు బండారు దేవేందర్, రాష్ట్ర యువజన కార్యదర్శి నీరుడి స్వామి, బైరం శివకుమార్, గాలెంక శ్రీనివాస్, నానంగిరి, సల్ల స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఆడబిడ్డల కష్టాలు పట్టించుకోని దుద్దిళ్ళ చవట..దద్దమ్మ..

**- 33నెలలుగా మాతాశిశును ఎందుకు సందర్శించలేదో జవాబు చెప్పాలే**

**- రెండు లక్షలు ఆదా చేయని మీ ముఖాలు మహిళలను కోటీశ్వరుల్ని చేస్తరా**

**- దుద్దిళ్ల కుటుంబానికి మరో 40ఏండ్లు అధికారం ఇచ్చినా ఈ ప్రాంతంపై ప్రేమ రాదు**

**- మంథని ఎమ్మెల్యే ఈ ప్రాంత బిడ్డ కాకపోవడమే అన్ని అనర్థాలకు ముఖ్య కారణం**

**- పేదింటి బిడ్డల కోసం కట్టించిన ఆస్పత్రిని నిర్వహించలేని మూర్ఖుడు దుద్దిళ్ళ శ్రీధర్**

**- పరిపాలన అంటే ఆస్తులు సంపాదించుకోవడం కాదని దుద్దిళ్ల గ్రహించాలే**

**- మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



మంథని ( ప్రశ్న న్యూస్) పేదింటి ఆడబిడ్డల కాన్పు కష్టాలు పట్టించుకోని మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ళ శ్రీధర్‌ను చవట, దద్దమ్మ అని ఎందుకు అనద్దని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ప్రశ్నించారు. మంథని పట్టణంలోని మాతా శిశు ఆస్పత్రిని భూపాలపల్లి జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ జక్కు శ్రీహర్షిణి తో కలిసి సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏడాన్నర క్రితం తాము మాతా శిశు ఆస్పత్రిని సందర్శించి డాక్టర్లను నియమించాలని విజ్ఞప్తి చేశామని గుర్తు చేశారు. రెండున్నర సంవత్సరాలుగా మాతా శిశు ఆస్పత్రిని కనీసం పట్టించుకోకుండా ఈ ప్రాంత ఆడబిడ్డల కష్టాలను ఏ మాత్రం గమనించకుండా 33నెలల సమయాన్ని మంథని ఎమ్మెల్యే వృదా చేశారని ఆయన మండిపడ్డారు. మంథని మట్టితో సబంధం లేకుంటే నాయకుడు ఈ విధంగానే ఉంటుందని, ఈ ప్రాంతంతో బంధుత్వం లేకపోవడం, ఏ వ్యక్తితో సంబంధం లేకపోవడం వల్లనే ఇవాల దుద్దిళ్ల శ్రీధర్ ఈ ఆస్పత్రి గురించి ఆలోచన చేయడం లేదన్నారు. పరిపాలన అంటే నీ కుటుంబానికి ఆస్తులు సంపాదించుకోవడం కాదని, నీకో పదవి నీతమ్ముడికో పదవి రావడం, మీ కార్లకు వెనుకా ముందు పోలీస్ ఎస్కార్ట్‌లు పెట్టుకోవడం కాదని, మీకు ఓటు వేసిన ప్రజల కష్టాలు తీర్చడానికి దేశంలో ప్రజాస్వామ్యం హక్కునిచ్చిందని గుర్తెరుగాలన్నారు. మట్టి పనికైనా ఇంటోడు కావాలనే సామెత ఉందని, కానీ మనోడు కాకపోవడం మూలంగానే ఈనాడు మాతా శిశు ఆస్పత్రిని నిర్వీర్యం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మూడు ఓట్లు ఉన్న కుటుంబానికి 40ఏండ్లు అధికారం ఇచ్చారని, మరో 40ఏండ్లు అధికారం ఇచ్చినా ఈ ప్రాంతంపై దుద్దిళ్ల కుటుంబానికి ప్రేమ పెరుగదన్నారు. ఈ ప్రాంత ప్రజలతో ఓటు సంబంధం తప్ప పేగు సంబంధం కాదన్నారు. ఇంత పెద్ద ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నా కానీ డాక్టర్లు లేరని, అసలు జిల్లా కలెక్టర్ ఏం చేస్తున్నారని, మంత్రికి అయితే అసలు సోయి లేదని ఎద్దేవా చేశారు. ఇంత పెద్ద పదవి వస్తే ఈ ప్రాంత ప్రజల ఓట్లతో వచ్చిందని గుర్తిస్తలేదని, అమెరికాలో ఉన్న మీ కుటుంబం, హైదరాబాద్‌లో ఉన్న మీ చుట్టాలు ఓట్లు వేస్తే ఈ పదవి రాలేదని మంథని గడ్డ మీద పుట్టిన రెండు లక్షల ముప్పావేల మందిలో మూడు ఓట్లు మాత్రమే ఉన్నవని గ్రహించాలన్నారు. నీరూపాన్ని చూసి అబద్దాలను నమ్మి ఓట్లు వేస్తే కనీసం ఇప్పటికైనా ఈప్రాంత ప్రజలమీద ప్రేమ రాకపోవడాన్ని ఏ విధంగా ఆలోచన చేయాలన్నారు.ఈనాడు మేం మాట్లాడగానే ఈ మట్టిలో పుట్టిన మా బీసీ ఎస్సీ బిడ్లతో తిట్టిపిస్తాడని, వాళ్లకు జ్ఞానం రాకపోయినా మంథని ఎమ్మెల్యేకు జ్ఞానం రావడానికి సిగ్గు లజ్జ మానం రావడానికి మూర్ఖుడని దద్దమ్మ అని ఎందుకు అనద్దో మాతా శిశు ఆస్పత్రిని చూసిన తర్వాత చెప్పాలన్నారు. మంథని మార్కెట్‌కు వస్తున్నా లారీలను పెట్టండని చెప్పితే లారీలు రావా అని ప్రశ్నించారు. ఎక్కడ కాంటాలు పెడుతుండ్లో, ఎక్కడ లారీ వస్తున్నయో మీరు తిరుగితే తెలుస్తాయి కదా అన్నారు. ఎక్కడైతే తాము తిరుగతమో అక్కడ మచ్చుకు తునకగా చూపిస్తున్నారే తప్ప పూర్తి స్తాయిలో పనులు చేయడం లేదన్నారు. ఇప్పటి వరకు మాతాశిశు ఆస్పత్రికి ఎందుకు సందర్శించలేదో సమాజానికి సమాధానం చెప్పాలన్నారు. డాక్టర్లు ఉంటుండ్లా లేరా అని తెలుసుకునే ఆలోచన ఎందుకు చేయడం లేదన్నారు. మీరు తెలుసుకోక పోయినా మమ్మల్ని తిట్టే వాళ్లను పంపించాలన్నారు. మేము వాళ్ల బిడ్డల కోసమే ఆలోచన చేస్తున్నమని, ఒక్క డెలివరీ కోసం ప్రైవేటు ఆస్పత్రికి పోతే రెండు లక్షల వరకు ఖర్చు అవుతాయన్నారు. పేదోడికి రెండు లక్షలు మిగులుతయని ఎమ్మెల్యే దుద్దిళ్ల కండ్లలో కారం పోసుకుంటున్నాడని అన్నారు. ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులను చేస్తమని గొప్పలు చెప్తోందని, ఇక్కడ మీ ముఖానికి రెండు లక్షలు ఆదా చేయడం లేదు కానీ ఇంకా కోటీశ్వరులను ఎలా చేస్తారని ఆయన విమర్శించారు. ఇంత పెద్ద ఆస్పత్రి నిర్మించి అన్ని సౌకర్యాలతో మీకు అప్పగిస్తే మెయింటనెన్స్ చేసే తెలివిలేని మూర్ఖులని ఆయన ఎద్దేవా చేశారు.మీలా టూరిస్టుల్లా వచ్చి పోయే వాళ్లం కాదని, ఇక్కడ మాకు పేగు సంబంధం ఉందన్నారు. కులమతాలకు అతీతంగా వరుసలతో పిలుచుకునే ఆప్యాయతలు ఉన్నాయన్నారు. ఓడిపోయిన తర్వాత ఇంట్ల పోయి పడుకోలేదని ప్రజల కోసమే పోరాటం చేస్తున్నామన్నారు. రెండోసారి మాతాశిశు ఆస్పత్రికి వచ్చామని, ఇప్పటికైనా సిగ్గు తెచ్చుకోవాలన్నారు. ఇంత పెద్ద ఆస్పత్రిలో డాక్టర్లను నియమించలేని ఆ మంత్రి పదవి ఎందుకన్నారు. వేల కోట్లు సంపాదించుకోవడానికి నీ తమ్ముడికి నాలుగు కంపెనీలు పెట్టి దోచుకోవడానికేనా అన్నారు., మీ కుటుంబానికి 40ఏండ్లు నీ అయ్యకు మూడుసార్లు, నీకు ఐదు సార్లు అవకాశం ఇస్తే ఆడోళ్ల కోసం ఆలోచించని దుద్దిళ్ల శ్రీధర్‌ను దద్దమ్మ, చవట, సన్నాసి అని ఎందుకు అనవద్దని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పక్కన కూర్చుంటే, కార్లలో తిరుగుతుంటే మేం సంబరపడాలా ఆస్తులు సంపాదించుకుంటే సంబరపడాలా అని ప్రశ్నించారు.ఖబర్ధార్ ఎమ్మెల్యే నీ గల్లా పట్టే రోజులు తీసుకువస్తమని, ప్రజలను అప్రమత్తం చేస్తం అనునిత్యం నిన్ను వెంటాడుతమని హెచ్చరించారు. ఏకైక వ్యక్తిగా అనునిత్యం ఇక్కడ మాట్లాడుతుంటే నా గొంతు నొక్కడానికి అనేక కుట్రలు చేస్తున్నారని, ఏ విధంగా అంతమొందించాలే, ఏ విధంగా కటకటాల వెనక్కి పంపించాలనే ఆలోచన చేస్తున్నారని అన్నారు. తుది శ్వాస ఉన్నంత వరకు నియోజకవర్గంలో 80శాతం పైబడి ఉన్న మా వర్గాల్లో చైతన్యం కోసం వాళ్ల ఆకలి తీర్చడం కోసం పోరాటం చేస్తూనే ఉంటానని అన్నారు. మా వర్గాలను అమాయకులను చేసి తిప్పించుకుంటున్నాడని, రెండులక్షల ముప్పైవేల మందిని ఏ విధంగా అమాయకులను చేసిండని, ఈ రాష్ట్రాన్ని అమాయకులను చేయడానికి మానిఫెస్టో కమిటి చైర్మన్ చేస్తే 420హామీలు రాసి ఒక్కటి అమలు చేయకుండా యావత్తు రాష్ట్రాన్ని మోసం చేసిన దొంగ దుద్దిళ్ల శ్రీధర్ అని ధ్వజమెత్తారు. ఐఏఎస్ అధికారి అయిన జిల్లా కలెక్టర్ సైతం మాతా శిశు ఆస్పత్రిపై స్పందించడం లేదని, ఎమ్మెల్యేల అడుగులకు మడుగులు ఒత్తడం, సంచులు మోయడం కాదని, ఆస్పత్రుల నిర్వహణపై దృష్టి పెట్టి డాక్టర్లను నియమించాలన్నారు. జిల్లాలో చేతకాని కలెక్టర్‌గా గుర్తింపు పొందకూడదని ఆయన హితవు పలికారు. ఎమ్మెల్యేతో సంబంధం లేకుండా నిధులు కేటాయించే అధికారం జిల్లా కలెక్టర్‌కు ఉంటుందని ఆ అధికారంలో డాక్టర్‌లను నియమించాలన్నారు.

మాతా శిశు ఆస్పత్రిలో డాక్టర్‌లను నియమించకుంటే మహిళలతో ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. అధికారంలో ఉన్నప్పుడు ఆస్పత్ర కట్టి చూపించామని, ప్రతిపక్షంలో ఉండి మీ మెడలు వంచడం కోసం పని చేస్తున్నామని, ఇప్పటి కైనా జిల్లా కలెక్టర్, మంథని ఎమ్మెల్యే స్పందించి మాతా శిశును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

# గంగ భవాని జాతరలో భక్తులకు చలివేంద్రం

**- ఏర్పాటు చేసిన రిటైర్డ్ ఆర్మీ జవాన్ కొమ్ము కోటి**





నకిరేకల్ (ప్రశ్న న్యూస్) ఐటిపాముల, గంగాదేవిగూడెం గ్రామాల్లో జరుగుతున్న గంగ భవాని జాతర సందర్భంగా రిటైర్డ్ ఆర్మీ జవాన్ కొమ్ము కోటి సేన ఆధ్వర్యంలో భక్తుల కోసం చలివేంద్రం ఏర్పాటు చేశారు. మండుతున్న ఎండల మధ్య జాతరకు విచ్చేసిన భక్తులకు చల్లని తాగునీరు అందించి వారి దాహార్తిని తీర్చారు. కొమ్ము కోటి సేన భారత సైన్యంలో 20 సంవత్సరాల పాటు సేవలందించి 2017లో పదవీ విరమణ పొందారు. ఆర్మీ నుంచి రిటైర్ అయిన తర్వాత కూడా సమాజ సేవను తన జీవిత లక్ష్యంగా కొనసాగిస్తున్నారు. కరోనా మహమ్మారి సమయంలో తన ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రెండు నెలల పాటు స్థానిక పోలీసులతో కలిసి నకిరేకల్‌లో వాలంటరీగా విధులు నిర్వహించారు.అదే సమయంలో కరోనా బారిన పడిన తన మిత్రుడి ప్రాణాలను కాపాడేందుకు అప్పటి సీపీ సజ్జనార్ సమక్షంలో ప్లాస్మా దానం చేశారు. కరోనా కారణంగా మృతి చెందిన వారి అంత్యక్రియల్లో పాల్గొని, మృతదేహాలను మోసేందుకు సైతం వెనుకాడలేదు. అనంతరం తనకూ కరోనా సోకినప్పటికీ, తన శారీరక దృఢత్వంతో వ్యాధిని జయించారు. సేవా కార్యక్రమాల పట్ల అంకితభావంతో ముందుకు సాగుతున్న కొమ్ము కోటి సేన, భవిష్యత్తులో రాజకీయాల్లోకి వచ్చి ప్రజలకు మరింత ప్రత్యక్షంగా సేవ చేయాలనే ఆకాంక్షను వ్యక్తం చేస్తున్నారు. అలాగే 2017లో పదవీ విరమణ అనంతరం తన స్వగ్రామమైన గంగాదేవిగూడెంలో తన తాతగారి స్మారకార్థం సొంత ఖర్చులతో రూ.1 లక్ష వ్యయంతో బస్ షెల్టర్ నిర్మించి గ్రామ ప్రజలకు అందించారు. సమాజ సేవలో నిరంతరం ముందుండే కొమ్ము కోటి సేన సేవా కార్యక్రమాలను స్థానికులు అభినందిస్తూ, యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడుతున్నారు.

# ఆరేళ్లలోపు చిన్నారులను అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలి

**- ఐసీడీఎస్ సీడీపీఓ : సౌందర్య**

**- అంగన్వాడీ కేంద్రంలో ఘనంగా "అమ్మ మాట -- అంగన్వాడీ బాట" కార్యక్రమం**

వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణంలోని జగిత్యాల బస్టాండ్ ప్రాంతంలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో శనివారం "అమ్మ మాట -- అంగన్వాడీ బాట" కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ సీడీపీఓ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమానికి సీడీపీఓ సౌందర్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 30 నెలల నుంచి 6 సంవత్సరాల లోపు వయస్సు గల చిన్నారులను తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించాలని తల్లులకు సూచించారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటలు, పాటల ద్వారా ప్రాథమిక విద్యతో పాటు పౌష్టికాహారం అందించబడుతుందని వివరించారు. చిన్నారుల సమగ్ర అభివృద్ధికి అంగన్వాడీ సేవలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అంజమ్మ,అంగన్వాడీ టీచర్ శోభారాణి,అంగన్వాడీ ఆయా విజయ, గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు,వారి తల్లులు పాల్గొన్నారు.



## తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థలో

# సమ్మర్ డిస్కౌంట్ ముగింపు




హైదరాబాద్(ప్రశ్న న్యూస్)వేసవి కాలంలో ప్రయాణికులకు ఉపశమనం కలిగించేందుకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రవేశపెట్టిన ప్రత్యేక సమ్మర్ డిస్కౌంట్ ఆఫర్ ముగిసిందని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రకటించింది. మూడు నెలల (మార్చి, ఏప్రిల్, మే ) పాటు ఇచ్చిన రాయితీ గడువు ముగియడంతో, జూన్ 1 నుండి మెట్రో డీలక్స్, ఏసీ బస్సుల్లో పాత చార్జీలను యథావిధిగా పునరుద్ధరిస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. అయితే ఈ మార్పుపై ప్రయాణికుల్లో ఎలాంటి గందరగోళం లేకుండా టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం ఒక ముఖ్యమైన స్పష్టతనిచ్చింది. ఆర్టీసీ బస్సుల్లో కొత్తగా ఎలాంటి ఛార్జీలను పెంచలేదని, కేవలం వేసవి కాలం కోసం ప్రత్యేకంగా అందించిన సమ్మర్ డిస్కౌంట్ గడువు మాత్రమే ముగిసిందని పేర్కొంది. కాబట్టి ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి సంస్థకు సహకరించాలని అధికారులు కోరారు.తీవ్రమైన ఎండల దృష్ట్యా సామాన్య ప్రయాణికులకు సుఖవంతమైన, ఏసీ ప్రయాణాన్ని అందుబాటు ధరల్లో అందించాలనే ఉద్దేశ్యంతో టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి ఆదేశాల మేరకు ఈ సమ్మర్ ఆఫర్‌ను ప్రవేశపెట్టడం జరిగింది. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మెట్రో డీలక్స్ మరియు ఈ-మెట్రో ఏసీ బస్సుల్లో ప్రయాణించే వారికి మార్చి 2026 నుండి మే 31, 2026 వరకు ఈ రాయితీలు అందుబాటులో ఉన్నాయి. మూడు నెలల పాటు కొనసాగిన సాగిన ఈ ఆఫర్ గడువు ముగియడంతో జూన్ మొదటి తేదీ నుండి రాయితీకి ముందు ఉన్న పాత టికెట్ ధరలే అమలులోకి వస్తాయి.తీవ్ర వేసవి దృష్ట్యా సామాన్య ప్రయాణికులకు సౌకర్యవంతమైన ఏసీ ప్రయాణాన్ని అందుబాటు ధరల్లో అందించాలనే ఉద్దేశ్యంతో టీజీఎస్ ఆర్టీసీ ఎండీ వై.నాగిరెడ్డి ఆదేశాల మేరకు ఈ సమ్మర్ ఆఫర్‌ను నిర్వహించడం జరిగింది. ఈ మూడు నెలల పాటు ఆఫర్‌ను సద్వినియోగం చేసుకొని ఆర్టీసీకి సహకరించిన ప్రయాణికులకు సంస్థ యాజమాన్యం ధన్యవాదాలు తెలియజేసింది.

# నిష్పక్షపాత విధులే పోలీసుల లక్ష్యం

**రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ వీడియో కాన్ఫరెన్స్‌లో దిశానిర్దేశం**

**మెదక్ జిల్లా పోలీసు కార్యాలయం నుంచి పాల్గొన్న ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు**



మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడమే లక్ష్యంగా ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్ ఐపీఎస్ సూచించారు. రాష్ట్రంలోని పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు, క్షేత్రస్థాయి అధికారులతో శనివారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఈ సమావేశానికి మెదక్ జిల్లా పోలీసు కార్యాలయం నుంచి జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు హాజరయ్యారు.ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా వ్యవహరించాలని, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఫిర్యాదుల స్వీకరణ నుంచి కేసుల దర్యాప్తు వరకు ప్రతి దశలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండాలని తెలిపారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ పోలీసు శాఖపై విశ్వాసం పెంపొందించేలా పనిచేయాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో క్రమశిక్షణతో పాటు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో వేగం పెంచాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు జిల్లా స్థాయి అధికారులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో గస్తీ నిర్వహణ, డయల్-100 కాల్స్‌పై స్పందన, ఫిర్యాదుల పరిష్కారం, బాధితుల ఇంటి వద్దకే వెళ్లి కేసుల నమోదు వంటి అంశాలపై సమీక్షించారు. రాష్ట్ర స్థాయిలో ఫిర్యాదుల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ జరుగుతోందని, పెండింగ్ కేసులు లేకుండా వేగంగా దర్యాప్తు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాల ద్వారా ప్రజలకు మరింత చేరువ కావాలని ఎస్పీ సూచించారు. ప్రతి పోలీసు అధికారి ప్రజల సమస్యలపై స్పందిస్తూ అందుబాటులో ఉండాలని, విధుల నిర్వహణలో అలసత్వం ప్రదర్శించరాదని పేర్కొన్నారు. సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ సమర్థవంతంగా బాధ్యతలు నిర్వర్తించాలని సూచించారు.రాష్ట్ర పోలీసు శాఖ ప్రజాసేవల నాణ్యత పెంపుపై ప్రత్యేక దృష్టి సారించిందని, ఫిర్యాదులు, కేసులను పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రతి ఫిర్యాదుపై సమయానుకూలంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రజల విశ్వాసమే పోలీసు శాఖకు బలమని, ఆ విశ్వాసాన్ని మరింత బలోపేతం చేసే దిశగా పనిచేయాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో డియస్పి లు ప్రసన్న కుమార్, నరేందర్ గౌడ్, సుభాష్ చంద్ర బోస్, సీఐ లు రాజశేఖర్ రెడ్డి, మహేష్, సందీప్ రెడ్డి, కృష్ణ మూర్తి, ఆర్ఐ శైలందర్, ఎస్సై లు పాల్గొన్నారు.

# ఇప్పటికే 40 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి , కేంద్రాల మూసివేత

**47,436 మంది రైతులకు 512,87 కోట్ల రూపాయలు చెల్లింపు**

**జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా 64,493 మంది రైతుల నుంచి 3,05,018.360 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామన్నారు. అందులో 47, 463 రైతులకు 512,87 కోట్ల రూపాయలను వారి అకౌంట్లో జమ చేశామని తెలిపారు. రైతులు అధైర్య పడవద్దని , ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారుజిల్లాలో 40 ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోలు పూర్తయింది , వాటిని మూసివేయడం జరిగిందని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

# మంత్రి శ్రీధర్ బాబు జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు








మంథని ( ప్రశ్న న్యూస్) రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు జన్మదినం సందర్భంగా శనివారం శ్రీ దత్తాత్రేయ స్వామి దేవాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీధర్ బాబు గారు ఆయురారోగ్యాలతో, ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలను ఎదగాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్, వైస్ చైర్మన్ ముస్కుల సయేందర్ రెడ్డి, కౌన్సిలర్లు పెంటరి రాజు, మారుపాక నిహారిక, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడుదుల వెంకన్న, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ముస్కుల సురేందర్ రెడ్డి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి సెగ్గెం రాజేష్, మండల పార్టీ అధ్యక్షుడు ఐలి ప్రసాద్, పార్టీ సీనియర్ నాయకులు పనకంటి చంద్రశేఖర్, పేరవేణి లింగయ్య యాదవ్, బండ కిషోర్ రెడ్డి తోపాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి.

**అడిషనల్ కలెక్టర్ నాగేష్**



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) వరి ధాన్యం కొనుగోలు వేగవంతం చేసి, లేబర్ హమాలీలను పెంచాలని అడిషనల్ కలెక్టర్ నాగేష్ అధికారులను ఆదేశించారు. శనివారం చిలిపిచేడ్ మండలంలోని గౌతపూర్ గ్రామ శివారులో దక్కన్ ఆగ్రో రిసార్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ గోదాంను సందర్శించారు.ఈ సందర్భంగా అడిషనల్ నాగేష్ కలెక్టర్ మాట్లాడుతూ.. తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని నర్సాపూర్ లో రెండు గోదాములకు పంపిస్తామని, మిగతావన్నీ ఆగ్రో దక్కన్ గోదాం లోనే ధాన్యం బస్తాలను ఖాళీ ఇచ్చేస్తామన్నారు. లేబర్ ను పెంచి తొందరగా లారీ లో ఉన్న ధాన్యాన్ని ట్రాక్టర్ లో ఉన్న ధాన్యాన్ని దించుకోవాలని ఇన్చార్జ్ తాహాసిల్దార్ కు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇన్చార్జి తహసిల్దార్ జహీర్, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నర్సింగాపూర్‌లో ఈతవనం దగ్ధం.. గీత కార్మికులకు భారీ నష్టం

- **సంఘటనా స్థలాన్ని సందర్శించిన ఎక్సైజ్ శాఖ అధికారులు**
- **ప్రభుత్వాన్ని నష్టపరిహారం కోరిన గౌడ సంఘం నాయకులు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో శుక్రవారం రాత్రి భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకొని ఈతవనం దగ్ధమైనట్లు గౌడ సంఘం నాయకులు తెలిపారు. ప్రమాదంలో పెద్ద ఎత్తున ఈత చెట్లు కాలిపోవడంతో గీత కార్మికులకు తీవ్ర నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు.సమాచారం అందుకున్న ఎక్సైజ్ శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని దగ్ధమైన ఈతవనాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నష్టం వివరాలను అంచనా వేసి, ఘటనకు గల కారణాలపై విచారణ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పూర్తి నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని అధికారులు వెల్లడించారు.ఈ సందర్భంగా గౌడ సంఘం నాయకులు మంద చంద్రమౌళి గౌడ్, పంజాల శ్రీనివాస్ గౌడ్, మంద శ్రీనివాస్ గౌడ్, మంద రాములు గౌడ్, మంద కిరణ్, మంద రవి, మంద సాయి తదితరులతో పాటు సుమారు 20 మంది సంఘం నాయకులు పాల్గొన్నారు. దగ్ధమైన ఈతవనం వల్ల ఉపాధి కోల్పోయిన గీత కార్మికులకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించాలని వారు కోరారు.

# దుండ్రపల్లిలో ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు - డీఎస్పీ క్షేత్రస్థాయి విచారణ




బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, బోయినిపల్లి మండలంలోని దుండ్రపల్లి గ్రామంలో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుకు సంబంధించి శనివారం వేములవాడ డీఎస్పీ శ్రీనివాసులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు.గ్రామానికి చెందిన జంగం అంజయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు, అదే గ్రామానికి చెందిన గోలి సందీప్ రెడ్డి తనను కులం పేరుతో దూషించాడని ఆరోపణలు రావడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకునేందుకు డీఎస్పీ గ్రామానికి వెళ్లి సంబంధిత వ్యక్తులను విచారించారు. విచారణ సందర్భంగా సంఘటన జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన డీఎస్పీ, ఫిర్యాదుదారు, స్థానికుల నుంచి వివరాలు సేకరించారు. కేసును అన్ని కోణాల్లో పరిశీలించి నిష్పక్షపాతంగా దర్యాప్తు చేపడతామని అధికారులు తెలిపారు.డీఎస్పీ వెంట వేములవాడ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, బోయినిపల్లి సబ్ ఇన్స్పెక్టర్ ఎన్. రమాకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణాభివృద్ధిలో విఓఏల సేవలు కీలకం

- **వీఓఏల న్యాయమైన డిమాండ్లను వెంటనే నెరవేర్చాలి**
- **విఓఏ న్యాయ పోరాటానికి బీఆర్ఎస్ సంపూర్ణ మద్దతు**
- **జూన్ 02 లోగా విఓఏ ల సమస్యలు పరిష్కరించకపోతే తీవ్ర ఆందోళనలు చేపడుతాం**
- **చొప్పదండి మాజీ ఎమ్మెల్యే : సుంకె రవిశంకర్**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) చొప్పదండి నియోజకవర్గం, రాజన్న సిరిసిల్ల జిల్లా,బోయినిపల్లి మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర వీఓఏ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన కార్యక్రమంలో చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పాల్గొని వీఓఏల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వీఓఏలకు ఇచ్చిన శాశ్వత ఉద్యోగ భద్రత, వేతనాల పెంపు,సెర్ప్ ఉద్యోగులుగా గుర్తింపు, పదోన్నతులు వంటి హామీలను ఇప్పటికైనా అమలు చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో వీఓఏలు కీలక పాత్ర పోషిస్తున్నారని, వారి సేవలకు తగిన గుర్తింపు, గౌరవప్రదమైన వేతనాలు కల్పించాలని అన్నారు. జూన్ 2 తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం నాటికి సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టి వీఓఏల పోరాటానికి బీఆర్ఎస్ పూర్తి మద్దతు ఇస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య, మాజీ ఎంపీపీ సత్తినేని మాధవ్, ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్, కవ్వంపల్లి రాములు, మాజీ సర్పంచ్‌లు చిందం రమేష్, బూర్గుల నందయ్య, అక్కెనపల్లి కర్ణాకర్, ముద్దం రవి, బత్తిని కమల్ గౌడ్, భీమనాథుని రమేశ్, బోయిని రాజు,తుంటి మధుకర్, గురిజాల కోటి, పెరుక మహేష్, దూస మధు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కెమెరా క్లిక్స్ నుండి... క్రికెట్ షాట్స్ వరకు - క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలి

- **కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు : కొమ్మనబోయిన సువీన్ యాదవ్**
- **బోయినపల్లి ఫోటోగ్రాఫర్స్ జట్టుకు ప్రత్యేక జెర్సీల పంపిణీ**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్) చొప్పదండి నియోజకవర్గ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీల సందర్భంగా బోయినిపల్లి మండల ఫోటోగ్రాఫర్స్ జట్టుకు ప్రత్యేకంగా రూపొందించిన జెర్సీలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సువీన్ యాదవ్ మాట్లాడుతూ క్రీడలు యువతలో ఐక్యత, క్రమశిక్షణ, జట్టుస్ఫూర్తి, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని అన్నారు. ఫోటోగ్రాఫర్స్ తమ వృత్తి బాధ్యతలతో పాటు క్రీడల్లోనూ చురుకుగా పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో బోయినిపల్లి మండల జట్టు ఉత్తమ ప్రతిభ కనబర్చి విజయం సాధించాలని ఆకాంక్షించారు.జట్టు కోసం ప్రత్యేకంగా ముద్రించిన జెర్సీలను అందుకోవడం పట్ల ఫోటోగ్రాఫర్స్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.ఈ జెర్సీలు జట్టుకు ప్రత్యేక గుర్తింపును తీసుకురావడంతో పాటు ఆటగాళ్లలో మరింత ఉత్సాహాన్ని నింపుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో బూతం వీరస్వామి, దండు తిరుపతి, మండల శ్రీనివాస్, రవి, బుర్ర శివ, రాము, షాదుల్లా, ఫోటోగ్రాఫర్స్ సభ్యులు, క్రీడాకారులు, అభిమానులు పాల్గొని జట్టుకు శుభాకాంక్షలు తెలిపారు. పోటీల్లో బోయినిపల్లి జట్టు విజయవంతంగా రాణించాలని ఆకాంక్షిస్తూ సభ్యులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# తెలంగాణలో మళ్లీ ప్రాంతీయ మంట

## - పవన్, చంద్రబాబులే టార్గెట్.. వ్యూహం ఎవరిది.?



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ రాజకీయాల్లో మరోసారి ప్రాంతీయ సెంటిమెంట్ తెరపైకి వస్తోంది. ప్రొఫెసర్ నాగేశ్వర్ ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై చేసిన విశ్లేషణలతో మొదలైన ఈ వివాదం, ఇప్పుడు అనూహ్యంగా తెలంగాణ ఆత్మగౌరవ పోరాటంగా మార్చే ప్రయత్నం జరుగుతోంది. ముఖ్యంగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, సీఎం చంద్రబాబులను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ఈ పరిణామాలు రాబోయే ఎన్నికల కోసం సిద్ధం చేస్తున్న పొలిటికల్ గ్రౌండ్ లా కనిపిస్తున్నాయి.

### - ఏపీ వివాదం.. తెలంగాణ సమస్యగా మలుపు

ప్రొఫెసర్ నాగేశ్వర్ ఏపీ రాజకీయాల గురించి మాట్లాడటం కొత్తేమీ కాదు. అయితే ఈసారి ఆయన వ్యాఖ్యలపై ఏపీ నేతల స్పందనను సాకుగా చూపి, తెలంగాణలో ఒక వర్గం నేతలు దీనిని తెలంగాణపై దాడి గా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు. ఏపీ నేతలు తెలంగాణ వ్యక్తులను గౌరవించడం లేదనే భావనను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం ద్వారా మళ్లీ పాత సెంటిమెంట్‌ను రగిలించవచ్చని కొన్ని రాజకీయ శక్తులు భావిస్తున్నాయి. ముఖ్యంగా పవన్ కల్యాణ్‌ను టార్గెట్ చేయడం వెనుక గ్రేటర్ హైదరాబాద్‌లోని సెటిలర్ల ఓటు బ్యాంకును చీల్చడం లేదా ప్రభావితం చేయడం అనే బలమైన వ్యూహం కనిపిస్తోంది.

### - బీఆర్ఎస్ సైలెంట్ దూకుడు

### - సోషల్ మీడియా వార్

బీఆర్ఎస్ పార్టీకి చెందిన అగ్రనేతలు ఈ వివాదంపై నేరుగా మైకుల ముందుకు రాకపోయినప్పటికీ, ఆ పార్టీ సోషల్ మీడియా విభాగాలు మాత్రం అత్యంత దూకుడుగా వ్యవహరిస్తున్నాయి. పవన్ కల్యాణ్ గతంలో తెలంగాణపై చేసిన వ్యాఖ్యలను, చంద్రబాబు పాత రాజకీయాలను తవ్వి తీస్తూ రీల్స్, పోస్టులతో హోరెత్తిస్తున్నారు. నేరుగా విమర్శిస్తే నెగెటివ్ ఇంపాక్ట్ ఉంటుందని భావించి, సోషల్ మీడియా ద్వారా సెంటిమెంట్ మంట ను రాజేసే బాధ్యతను కింది స్థాయి కేడర్‌కు అప్పగించినట్లు కనిపిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏపీ నేతలకు లొంగిపోతోందనే ముద్ర వేయడం ద్వారా రేవంత్ రెడ్డి సర్కార్‌ను ఇరకాటంలో పెట్టడమే వీరి ప్రధాన ఉద్దేశం.

### - ఎన్టీఆర్ విగ్రహం నుంచి నాగేశ్వర్ దాకా

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ చేసి టీడీపీ సానుభూతిపరులకు దగ్గరయ్యే ప్రయత్నం చేయగా, దానికి విరుగుడుగా ఇప్పుడు నాగేశ్వర్ ఇష్యూను విపక్షాలు వాడుకుంటున్నాయి. "తెలంగాణ గడ్డపై ఏపీ నేతల పెత్తనం ఏంటి?" అనే పాత నినాదాన్ని మళ్లీ వాడుతూ, రేవంత్ రెడ్డిని ఏపీ ప్రయోజనాల పరిరక్షకుడి గా చూపించే ప్రయత్నం జరుగుతోంది. పవన్ కల్యాణ్ ను వ్యక్తిగతంగా దూషించడం ద్వారా ఆయన అభిమానులను రెచ్చగొట్టి, తద్వారా వచ్చే ఘర్షణ వాతావరణాన్ని రాజకీయంగా వాడుకోవాలనేది ఈ షాడో పాలిటిక్స్ అసలు ప్లాన్ అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### - ప్రజా స్పందన ఉంటుందా.?

దశాబ్దం క్రితం ఉన్నంత తీవ్రస్థాయిలో ఇప్పుడు సెంటిమెంట్ పనిచేస్తుందా అనేది సందేహమే. తెలంగాణ ప్రజలు, ముఖ్యంగా యువత ఇప్పుడు ఉద్యోగాలు, అభివృద్ధి, మౌలిక సదుపాయాల గురించి ఆలోచిస్తున్నారు. కేవలం వ్యక్తుల మధ్య జరిగే మాటల యుద్ధాన్ని ప్రాంతీయ పోరాటంగా మార్చాలని చూస్తున్న వారి ఉద్దేశాన్ని సామాన్యులు గమనిస్తున్నారు. గత పదేళ్లలో ఏపీ–తెలంగాణ మధ్య సత్సంబంధాలు పెరగడం, వ్యాపార లావాదేవీలు విడదీయలేని విధంగా ఉండటంతో.. ఈ కృత్రిమ సెంటిమెంట్ పెద్దగా ప్రభావం చూపకపోవచ్చని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఏపీ రాజకీయాలపై నాగేశ్వర్ చేసిన వ్యాఖ్యలకు సమాధానం అక్కడి నుంచే రావాలి కానీ, దానిని తెలంగాణ సమస్యగా మార్చడం అంటే అభివృద్ధి అజెండా నుంచి ప్రజల దృష్టిని మళ్లించడమే అవుతుందన్న అభిప్రాయం ఎక్కువగా వినిపిస్తోంది.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల దృష్ట్యా ఈ పవన్–బాబు టార్గెట్ పాలిటిక్స్ మరింత ముదిరే అవకాశం ఉంది. అయితే, ప్రజలు వాస్తవాలను గ్రహిస్తున్న తరుణంలో.. కేవలం సెంటిమెంట్‌ను నమ్ముకుని చేసే రాజకీయాలు ఎంతవరకు ఫలిస్తాయో కాలమే నిర్ణయించాలి.

## సికింద్రాబాద్ ఎంటోమాలజీ విభాగంలో


# మళ్లీ అవినీతి దందా.?

### - విజిలెన్స్ విచారణ ఎదుర్కొన్న అధికారికే మళ్లీ కీలక పోస్టింగ్

### - జీహెచ్ఎంసీ ఖజానాకు గండి పడుతోందంటూ ఆరోపణలు

### - కమిషనర్ తక్షణమే జోక్యం చేసుకోవాలని ప్రజల డిమాండ్





సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ సర్కిల్ ఎంటోమాలజీ (కీటక విజ్ఞాన) విభాగంలో మళ్లీ అవినీతి దందా మొదలైందా.? గతంలో విజిలెన్స్ విచారణలో చిక్కుకుని తీవ్ర ఆరోపణలు ఎదుర్కొన్న అధికారికే మళ్లీ అదే స్థానంలో పోస్టింగ్ ఇవ్వడం వెనుక అసలు మర్మమేంటనే ప్రశ్నలు ఇప్పుడు సర్వత్రా వినిపిస్తున్నాయి. ప్రజారోగ్య పరిరక్షణకు కీలకమైన ఎంటోమాలజీ విభాగంలో జరుగుతున్న ఈ పరిణామాలు అధికార యంత్రాంగంపై అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం సీనియర్ ఎంటోమాలజిస్ట్ దుర్గ ప్రసాద్ గతంలో దోమల నివారణ కోసం వినియోగించాల్సిన మందులు, ప్రభుత్వ వాహనాలకు కేటాయించిన పెట్రోల్, డీజిల్ వంటి ప్రభుత్వ వనరుల దుర్వినియోగానికి సంబంధించిన ఆరోపణల్లో విజిలెన్స్ విచారణను ఎదుర్కొన్నారు. ఈ వ్యవహారంలో వాస్తవాలు వెలుగులోకి రావడంతో కొంతకాలం విధులకు దూరంగా ఉంచారు. ఇప్పుడు తిరిగి అదే సికింద్రాబాద్ సర్కిల్‌లో కీలక బాధ్యతలు చేపట్టడం తీవ్ర చర్చకు దారితీస్తోంది.

అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తిని తిరిగి అదే విభాగంలో నియమించడం ద్వారా జిహెచ్ఎంసి కమిషనర్ ప్రజలకు ఎలాంటి సందేశం ఇవ్వాలనుకుంటున్నారనే ప్రశ్నలు ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. ఒకవైపు పారదర్శక పాలన, అవినీతి రహిత పరిపాలన అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రచారం చేస్తుంటే, మరోవైపు వివాదాస్పద అధికారులకు కీలక స్థానాలు అప్పగించడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది. స్థానికుల ఆరోపణల ప్రకారం, బాధ్యతలు స్వీకరించిన వెంటనే పాత వ్యవహార శైలికి తిరిగి తెరలేపినట్లు ప్రచారం జరుగుతోంది. దోమల నివారణ కార్యక్రమాలకు సంబంధించిన సామగ్రి వినియోగం, వాహనాల నిర్వహణ, ఇంధన ఖర్చుల విషయంలో పలు అవకతవకలు జరుగుతున్నాయని కొందరు సామాజిక కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత అధికారులు స్పందించాల్సి ఉంది. ప్రజారోగ్యానికి అత్యంత కీలకమైన ఎంటోమాలజీ విభాగంలో అవినీతి చోటుచేసుకుంటే దాని ప్రభావం నేరుగా నగర ప్రజలపై పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దోమల నివారణ కార్యక్రమాలు సమర్థంగా అమలు కాకపోతే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి వ్యాధులు విస్తరించే అవకాశం ఉందని వారు సూచిస్తున్నారు.

ఇప్పటికైనా జీహెచ్ఎంసీ కమిషనర్, ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. గత ఆరోపణలు, విజిలెన్స్ విచారణ వివరాలు, ప్రస్తుత కార్యకలాపాలపై సమగ్ర దర్యాప్తు జరిపి వాస్తవాలను బహిర్గతం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజాధనాన్ని కాపాడటంతో పాటు సంస్థ ప్రతిష్టను నిలబెట్టేందుకు జిహెచ్ఎంసి కమిషనర్ స్వయంగా జోక్యం చేసుకుని పారదర్శక విచారణకు ఆదేశాలు జారీ చేయాలని ప్రజలు కోరుతున్నారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అధికారులకు మళ్లీ అదే స్థానంలో కీలక బాధ్యతలు అప్పగిస్తే నిజాయితీగా పనిచేసే ఉద్యోగులకు ఎలాంటి సందేశం వెళ్తుంది.? అనే ప్రశ్న ఇప్పుడు సికింద్రాబాద్ వాసుల నుంచి బలంగా వినిపిస్తోంది. ఈ ఆరోపణలపై జీహెచ్ఎంసీ కమిషనర్ ఎలా స్పందిస్తారో అన్నది ఆసక్తికరంగా మారింది.

# హైదరాబాదులో జపనీస్ ట్రెండ్


### - ఐస్‌తో తయారైన గ్లాసులో కాఫీ!




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) హైదరాబాద్ కేఫ్ కల్చర్‌లో ఓ సరికొత్త ట్రెండ్ నగరవాసులను ఆకట్టుకుంటోంది. జపనీస్ కేఫ్ సంస్కృతి స్ఫూర్తితో, నగరంలోని 'ఎట్–సి' అనే కేఫ్ వినూత్నమైన అనుభవాన్ని అందిస్తోంది. ఇక్కడ ఐస్ ముక్కలు వేసిన కాఫీకి బదులుగా, స్వచ్ఛమైన ఐస్‌తోనే తయారు చేసిన గ్లాసులో కాఫీని సర్వ్ చేస్తున్నారు. జపాన్‌లోని టోక్యో, ఒసాకా నగరాల్లో ప్రాచుర్యం పొందిన ఈ విధానాన్ని ఇక్కడ ప్రవేశపెట్టారు. సాధారణ ఐస్ ముక్కల్లా కాకుండా, ఈ ఐస్ గ్లాస్ చాలా నెమ్మదిగా కరుగుతుంది. దీంతో డ్రింక్ రుచి, ఉష్ణోగ్రత సమయం గడిచేకొద్దీ మారుతూ, ఓ కొత్త అనుభూతిని ఇస్తుంది. ఈ గ్లాస్‌లోని డ్రింక్ తాగే కొద్దీ, అది లోపలి నుంచి కరుగుతూ వస్తుంది. ఈ ప్రత్యేకమైన ఐస్ గ్లాస్ తయారీకి 48 నుంచి 56 గంటల సమయం పడుతుంది. ఆర్ఓ, యూవీ టెక్నాలజీలతో శుద్ధి చేసిన నీటిని నెమ్మదిగా ఫ్రీజ్ చేయడం వల్ల ఇది పూర్తి పారదర్శకంగా, దృఢంగా ఉంటుంది. అందుకే ఈ గ్లాస్ దాదాపు 45 నిమిషాల పాటు కరగకుండా ద్రవాన్ని నిల్వ ఉంచుతుంది. రెండు, మూడు నెలల పరిశోధన తర్వాత ఈ కేఫ్ యాజమాన్యం ఈ విధానాన్ని ప్రారంభించింది. ప్రస్తుతం మెనూలో టిరామిసు లాటే, చాక్లెట్ మౌస్ మోకా, హాట్ చాక్లెట్ అఫోగాటో వంటి వెరైటీలు అందుబాటులో ఉన్నాయి. ఒక్కో డ్రింక్ ధరను రూ. 595గా నిర్ణయించారు. హైదరాబాద్ ఎండల నుంచి ఉపశమనం పొందాలనుకునే వారికి ఇదొక వినూత్నమైన, ఆకర్షణీయమైన ఎంపికగా నిలుస్తోంది.

# తెలంగాణ ఎడ్‌సెట్ 2026 ఫలితాలు విడుదల


### - 96.95 శాతం మంది అభ్యర్థులు ఉత్తీర్ణత



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ ఎడ్‌సెట్–2026 ఫలితాలు విడుదలయ్యాయి. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి, కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ప్రతాప్‌రెడ్డి శనివారం (మే 30న) ఈ ఫలితాలను సంయుక్తంగా విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎడ్‌సెట్ పరీక్షకు మొత్తం 35,600 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 29,342 మంది పరీక్ష రాశారు. కాగా, హాజరైన వారిలో 28,446 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. ఈ ఏడాది పరీక్షలో రికార్డు స్థాయిలో 96.95 శాతం ఉత్తీర్ణత నమోదైంది. ఈ ఫలితాలలో బాణోత్ అజిత్ సాయి రాష్ట్రస్థాయిలో మొదటి ర్యాంకు సాధించి టాపర్‌గా నిలిచారని అధికారులు తెలిపారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి తరపున ఈ ఏడాది ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్షను వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం కంప్యూటర్ ఆధారిత పరీక్ష విధానంలో నిర్వహించడం తెలిసిందే. ఎడ్‌సెట్ రాసిన అభ్యర్థులు తమ ఫలితాలను, ర్యాంక్ కార్డులను అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ హాల్ టికెట్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను నమోదు చేసి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

# కాళేశ్వరం ప్రాజెక్టు పరిస్థితిపై బండారు దత్తాత్రేయ ఆందోళన

### - మూడు ప్రధాన ప్రాజెక్టుల్లో బొట్టు నీరు లేదని ఆవేదన



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ గోదావరిఖనిలో పర్యటించిన సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిన ఉదంతంపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఇప్పటికే ఒక స్పష్టమైన నివేదికను ఇచ్చిందని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. దాదాపు లక్ష కోట్ల రూపాయల భారీ వ్యయంతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ప్రస్తుతం రైతులకు గానీ, ప్రజలకు గానీ ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందని దత్తాత్రేయ విమర్శించారు. ఇంత పెద్ద ప్రాజెక్టు నిరుపయోగంగా మారినప్పటికీ, దానికి అవసరమైన అత్యవసర మరమ్మతులు చేపట్టడంలో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వానికి సరైన చిత్తశుద్ధి కనిపించడం లేదని ఆయన ఆరోపించారు.

ప్రాజెక్టు పరివాహక ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకపోవడం వల్ల జరుగుతున్న నష్టాన్ని దత్తాత్రేయ వివరించారు. కాళేశ్వరం నీటిపై ఆధారపడిన ఉత్తర తెలంగాణ జిల్లాల రైతులు ప్రస్తుతం సాగునీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాజెక్టులో అత్యంత కీలకమైన మూడు ప్రధాన బ్యారేజీల్లో ప్రస్తుతం బొట్టు నీరు కూడా లేకపోవడం అత్యంత ఆందోళనకరమైన విషయమని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇకనైనా కాలయాపన చేయకుండా తక్షణమే స్పందించి, కాళేశ్వరం ప్రాజెక్టుకు పూర్తిస్థాయిలో మరమ్మతులు నిర్వహించాలని డిమాండ్ చేశారు. నిపుణుల సూచనల మేరకు పనులను వేగవంతం చేసి, ఉత్తర తెలంగాణ రైతాంగానికి సాగునీరు అందించే బాధ్యతను ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన స్వీకరించాలని బండారు దత్తాత్రేయ హితవు పలికారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588